


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 79

సోమవారం 10-6-2024

SIMULTANEOUSLY PRINTED AT WARANGAL | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

JEE ADVANCED 2024 ఫలితాలు

39 Years of Excellence

Infinity Learn by Sri Chaitanya

శ్రీచైతన్య IPL-SUPER 60 ప్రోగ్రామ్ ర్యాంకుల విశ్వరూపం

ALL INDIA 1 RANK

RAGHAV SHARMA
H.T. NO: 242053073* EWS

ఓపెన్ కేటగిరి ఆలిండియా టాప్ 10 లోపు 5 ర్యాంకులు

IPL 60

ఓపెన్ కేటగిరిలో ఆలిండియా	Marks	Name	H.T. No
4 RANK	337/360	RHYTHM KEDIA	247025176*
5 RANK	334/360	PUTTI KUSHAL KUMAR	246150349
6 RANK	333/360	RAJDEEP MISHRA	241016176*
9 RANK	329/360	DHRUVIN H DOSHI	241106162
10 RANK	329/360	A S S D B SIDHVIK SUHAS	246119101

పరీక్షా విధానంపై పట్టు వచ్చింది

నేను IIT-JEE లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4వ ర్యాంక్ సాధించడానికి శ్రీచైతన్య పటిష్టమైన ప్రోగ్రాములు, నిర్దిష్టమైన ప్రణాళిక నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వీకెండ్ టెస్టులు, యూనిట్ టెస్టులు, గ్రాండ్ టెస్టుల ద్వారా చాలా ప్రశ్నల అధ్యయనం చేయడమే కాకుండా అధ్యాపకుల ప్రోత్సాహమే నన్ను విజేతగా నిలిపాయి. శ్రీచైతన్య యాజమాన్యానికి నా కృతజ్ఞతలు.

రివిజన్ ప్రోగ్రామ్‌తో నేను ఎంతో నేర్చుకున్నాను

నేను IIT -JEE లో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 5వ ర్యాంక్ సాధించి, నా తల్లిదండ్రుల కలలను సాకారం చేశాను. IIT లక్ష్యంగా రూపొందించిన ప్రోగ్రామ్స్ వల్లనే నేను నా IIT లక్ష్యాన్ని ఈజీగా సాధించాను. IPL Super 60 ప్రోగ్రామ్ లోని 2 గంటల బోధన, 9 నెలల రివిజన్ ప్రోగ్రామ్ లోని పార్టు టెస్టులు, గ్రాండ్ టెస్టులు, వీక్లీ అసైన్మెంట్స్ ఎంతో ఉపయోగపడ్డాయి. శ్రీచైతన్య యాజమాన్యానికి నా కృతజ్ఞతలు.

P.Kushal kumar

ప్రశ్నాపత్రాల స్టాండర్డ్ నన్ను ఎప్పుడూ ఎలర్ట్ చేసింది

నాకు IIT-JEEలో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 7వ ర్యాంక్ సాధించడానికి శ్రీచైతన్య ప్రోగ్రాములు, స్టడీమెటీరియల్స్, రెగ్యులర్ గ్రాండ్ టెస్టు, Indepth Micro Analysis వల్లనే ఈ విజయం సాధ్యమయింది. గత రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ డౌట్ క్లియరింగ్ సెషన్లు, సబ్జెక్ట్ వారీగా, కాన్సెప్ట్ బలోపేతం చేసే సెషన్లు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. శ్రీచైతన్య బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు.

Rajdeep

నాకున్న ఒత్తిడిని తొలగించి, ఆత్మవిశ్వాసం పెంచారు

IIT -JEE లో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 9వ ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. శ్రీచైతన్య ఒత్తిడిలేని శిక్షణ, పటిష్టమైన ప్రోగ్రాములు, నిర్దిష్టమైన ప్రణాళిక, స్టడి మెటీరియల్ వల్లనే నేను ఐఐటీ క్రాక్ చేశాను. కేర్, మోటివేషన్, హైజీనిక్ ఫుడ్ తో ఇంటిని మరిపించే హాస్టల్ ఎన్విరాన్మెంట్ కారణంగా మాకు చదువుపై ఫోకస్ పెరిగింది. నాకు ఎంతో సపోర్ట్ గా నిలిచిన శ్రీచైతన్య విద్యాసంస్థ మేలు ఎప్పటికి మరచిపోలేను.

Dhruvin

ఎగ్జామ్ ఎనాలసిస్ నా తప్పులను తెలిసేలా చేసింది

నేను IIT-JEE 2024 ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంక్ సాధించగలిగానంటే ఇందుకు ప్రధాన కారణమైన శ్రీచైతన్య IPL, Super 60 ప్రోగ్రామ్స్, స్టడీ మెటీరియల్, పరీక్షా విధానము, ఎర్రర్ అనాలసిస్ తో పాటు అధ్యాపకులు వ్యక్తిగత శ్రద్ధతో సందేహాలు నివృత్తి చేయడం, మేనేజ్మెంట్ స్నేహ పూర్వక ప్రోత్సాహంతో నా ఆశయానికి వెన్నుదన్నుగా నిలిచిన శ్రీచైతన్యకి కృతజ్ఞతలు.

A.Suhas

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో టాప్ 100 లోపు 30 ర్యాంకులు

Rank	Name	H.T. No
12	RAGHAV SHARMA	242053073*
14	VEDANT SAINI	247004173
16	BISMIT SAHOO	242072080*
28	SHEKHAR JHA	242031290*
31	ISHAAN GUPTA	242014288*
34	N SIDDHARTH REDDY	246053446
38	AKSHAR ZALA	241019087*
43	KESHAV SINGHAL	242027289*
55	SATIVADA JYOTHIRADITYA	246022079
57	AADITYA KUMAR	242067130*
68	MAYANK JAIN	247004363
71	P V S D SAI MOHITH	246008172
74	HIMANSHU THALOR	242050438*
77	MOHAMMAD EMAAD ARIF	242054030*
83	AMAAN KHAN	242026030*
85	BIBASWAN BISWAS	245058146*
88	FENIL MAYANK PATEL	241006043*
91	AMAR SINHA	242057008*
93	HARDIK AGGARWAL	247007101*
94	G N NIRMALKUMAR	241110162*
95	UJJWAL SINGH	242050207*
96	ANIKET KUMAR	243035068
97	M E VENKATA PARTHIV	246162250
99	TANAY CHETAN KAKLIYA	242057318*
100	T V S SAI NAGA BHUSHAN	246016038



4,187+ JEE ADVANCED 2024లో శ్రీచైతన్య సాధించిన ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 100 లోపు	ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 500 లోపు	ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 1000 లోపు	ఆలిండియా ఆల్ క్యాటగిరి 100 లోపు	ఆలిండియా ఆల్ క్యాటగిరి 1000 లోపు
30 ర్యాంకులు	122 ర్యాంకులు	203 ర్యాంకులు	146 ర్యాంకులు	721 ర్యాంకులు

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Ph: 040 66 06 06 06 | www.srichaitanya.net

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP/AITS


తెలుగు రాష్ట్రాలు గర్వించేలా... తెలుగు విద్యార్థి గర్వపడేలా...
Infinity Learn
IIT JEE ADVANCED ఫలితాల్లో శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థుల విశ్వరూపం
(మాదాపూర్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లు)
ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS
1 RANK BIBASWAN BISWAS*
3 RANK SALLURI VIVEK
4 RANK VASANTA SRIRAJ
5 RANK HIMANSHU THALOR*
6 RANK RAJDEEP MISHRA*
8 RANK P V S D SAI MOHITH
9 RANK M E VENKATA PARTHIV
10 RANK A S S D B SIDHVIK SUHAS
ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య సాధించిన టాప్ 1000లోపు 203 ర్యాంకులు
106 112 120 122 123 124 125 135 142 145 149
150 152 154 156 160 164 165 167 169 172 175
178 180 181 183 185 192 204 206 207 210 213
214 215 219 223 224 227 228 233 235 238 242
244 248 249 252 253 259 260 264 274 275 283
297 299 304 308 311 318 326 333 334 339 353
355 369 379 384 393 395 399 401 402 405 406
410 420 421 431 435 436 440 454 465 467 470
481 484 494 495 508 509 519 522 525 544 551
556 573 579 591 599 600 604 617 620 645 647
658 662 670 671 685 690 693 694 696 704 708
712 713 714 716 720 724 725 729 740 764 767
772 779 780 784 787 792 795 802 803 804 807
808 809 813 836 838 839 844 845 846 852 873
874 879 880 891 898 899 909 926 928 929 935
944 945 973 976 997 998 999 1000
Congratulations
*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP / AITS
IIT-JEE MAIN & ADVANCED
LONGTERM 2025
క్లాసులు 15 జూన్ 2024 నుండి ప్రారంభం
ADMISSIONS OPEN
HYDERABAD
BOYS RESIDENTIAL - 91000 65899 / 91774 22235 87126 00768 / 87126 00769
GIRLS RESIDENTIAL - 91770 46533 / 91000 91871 89779 05063 / 89779 05064
DAY SCHOLARS - 99486 76603 / 98661 08338
ALL INDIA / STATE RANKS | JEE MAIN-2024 | JEE ADV-2024 | AP EAPCET | TS EAPCET
<=2500 | 100% | 100% | 80% | 80%
<=5000 | 100% | 100% | 60% | 60%
<=10000 | 75% | 75% | 30% | 30%
<=20000 | 50% | 50% | 20% | 20%
SC/ST/PW BEST RANKERS | 60% | 60%
*Best of one is taken into Consideration
Scan QR code for WEBSITE
ADMISSIONS OPEN
Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
COACHING CENTRES
www.srichaitanyaknowledgehub.com
KUKATPALLY : 91774 44352
AMEERPET : 95151 11054
KONDAPUR : 95151 11428
VISAKHAPATNAM : 91774 44307
DILSUKHNAGAR : 91774 44326
HIMAYATNAGAR : 91774 44341
TRIMULGHERRY : 91774 44837
www.srichaitanya.net

సాక్షి వరంగల్

సోమవారం | 10 | జూన్ | 2024



..చిగురు తింటే నోరూరు

చింత చిగురులో ఎన్నో ఔషధగుణాలు ఉంటాయి. ప్రస్తుతం చెట్లు చిగురు తొడిగే కాలం కావడంతో ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

- 2లో▸



పెద్దమ్మ ఆలయంలో చోరీ

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలలోని పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ జరిగింది. బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు దోచుకెళ్లారు.

- 2లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33°/25°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి ఉంటుంది. సాయంత్రం సమయంలో చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు 6,622 మంది హాజరు



కాజీపేట సెంటర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు. 9,902 మంది అభ్యర్థులకు 6,622 మంది (72.8 శాతం) హాజరయ్యారని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. పలు కేంద్రాలను ఆమె సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థుల హాజరు, పరీక్ష కేంద్రాల్లోని సీసీ కెమెరాలు, సీటింగ్, మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట పలువురు అధికారులు ఉన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

కాజీపేట సెంటర్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు.

ధాన్యం చోరీ



పర్వతగిరి: రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలని మంగల్‌బోడ్‌తండాలో మాలోతు వీరన్నతోపాటు మరికొందరు రైతులు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టారు. కాగా, శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు ఐదు ట్రాక్టర్ల లోడు ధాన్యాన్ని ఎత్తుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. దొంగలను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రైతులు పోలీసులను కోరారు.

జాతీయ సమైక్యతతోనే దేశాభివృద్ధి

- కమాండెంట్ రవీంద్రకుమార్ రవి

మామునూరు: ఎన్‌సీసీ కేడెట్లు దేశ సమైక్యతకు పాటుపడుతూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎన్‌సీసీ 8వ బాలికల బెటాలియన్ వరంగల్ కమాండెంట్ రవీంద్రకుమార్ రవి అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సీసీ 8వ బాలిక బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకరన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపు శిక్షణ ఆదివారం 9వ రోజుకు చేరింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ కేడెట్లు సేవాభావాన్ని, దేశ భక్తిని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశం జీవితంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమణ, స్వప్న, టి.శ్రీనివాస్, సుజితాదేవి, 530 మంది కేడెట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్‌చేశారు. ఆదివారం మధ్యాహ్నం కామన్ మెస్‌లోని ఇంకా కొంతమంది విద్యార్థులు భోజనం చేయకముందే అన్నం, కూరలు అయిపోయాయని ఆరోపిస్తూ కామన్‌మెస్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న బేసిన్లను చూపుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆదివారం చికెన్‌ను పెట్టాల్సి ఉండగా పెట్టలేదని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, ఈక్రమంలో బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, కాకతీయ యూనివర్సిటీలోని కామన్ మెస్‌లో మెస్ సౌకర్యం పొందే విద్యార్థుల్లో చాలామంది గ్రూప్‌-1 పరీక్షకు వెళ్లడంతో వారి విజ్ఞప్తి మేరకు మెనూ ప్రకారం ఆదివారం పెట్టాల్సిన చికెన్‌ను బుధవారం పెట్టాలని నిర్ణయించినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య తెలిపారు.

ఫసల్ బీమాతో ధీమా

- ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం
- కసరత్తు చేస్తున్న వ్యవసాయశాఖ
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వానాకాలం నుంచే ఉచిత క్రాప్ ఇన్సూరెన్స్
- జిల్లాలో ఈసారి 3,13,500 ఎకరాల్లో పంటలు



చంద్రుగొండలో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ రంజిత్‌కుమార్



నెక్కొండ: కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకం (ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన-పీఎంఎఫ్‌బీవై) తిరిగి అమలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఈ పథకం 2016 నుంచి 2020 వరకు అమల్లో ఉంది. తర్వాత నుంచి పంట నష్టపోయిన రైతులకు ఎలాంటి బీమా వర్తించడం లేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఈ వానాకాలం సీజన్‌లో అమలు చేయనున్న పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు, బీమా పరిహారం తదితర వాటితోపాటు పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న పంటల బీమా పథకంపై అధ్యయనం చేస్తున్నారు. గతంలో అమలు చేసిన పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం ప్రీమియం, మిగిలిన 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించేవారు. పరిహారం పొందడంలో సమస్యలు ఉండడటం, పెద్దగా రైతులకు ఉపయోగం లేదనే కారణంతో గత ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేయలేదు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీచేయడంతోపాటు ప్రీమియం మొత్తం చెల్లించాలనే నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 3,13,500 ఎకరాల్లో 1.50 లక్షల మంది రైతులు ఈసారి పంటలు సాగుచేయనున్నారు. వరిని ప్రధాన పంటగా, ఆ తర్వాత పత్తి, మొక్కజొన్న పంటలు ఉన్నాయి. ఇతర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి.

ఫసల్ బీమా యోజన లక్ష్యం..

- ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగిన రైతులకు ఆర్థిక సాయం అందించడం.
- రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడం.
- వినూత్న, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహించడం.
- రైతుల రుణ అర్హతను నిర్ధారించడం, పంటల వైవిధ్యం, వ్యవసాయ రంగం వృద్ధి, పోటీతత్వాన్ని పెంపొందించడంతోపాటు ఉత్పత్తి ప్రమాదాల నుంచి రైతులను రక్షించడం.
- ప్రతి సంవత్సరం ఏదో రకంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం పంట బీమా పథకం అమలు చేయనుంది. పత్తికి వాతావరణ ఆధారిత గ్రామం యూనిట్‌గా, ఇతర పంటలకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేయనున్నారు. ఏఏ పంటలకు బీమా వర్తింపజేస్తారు, ప్రీమియం, పరిహారం, బీమా ఎలా అమలు అనేది తేల్చాల్సి ఉంది. వీటికి సంబంధించి వ్యవసాయ శాఖ అధ్యయనం చేస్తోంది.

పక్కాగా అమలు..

పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు ఇప్పటికే క్లస్టర్ల వారీగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. అధికారుల తప్పిదాలతో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు, పంటల నమోదుపై గొడవలు చోటుచేసుకోవడంతో పంటల బీమా పకడ్బందీగా అమలు చేయనున్నారు. ఇందుకు బయోమెట్రిక్ తీసుకోవడంతోపాటు రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుండటంతో పంటల బీమా పథకాన్ని త్వరగా తేల్చాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల వారీగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం తదితర వాటికి సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించడం, రైతులపై ఎలాంటి భారం పడకుండా పంటల పథకాన్ని అమలు చేయనున్నారు.

రైతులకు ప్రయోజనం..



ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. వానాకాలం పంటల నుంచి రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లోని పంటలకు వర్తింపజేస్తారు. ప్రభుత్వమే ప్రీమియం భరిస్తుంది. బీమా ప్రయోజనాలు పొందేలా రైతులకు ఏఈఓలు అవగాహన కల్పిస్తున్నారు.

- ఉషాదయాళ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అద్దె భవనాల్లో ప్రభుత్వ పాఠశాలలు



వరంగల్ ఎల్‌బీనగర్‌లో అద్దె భవనంలో ఉన్న ఉర్దూ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల



అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజీ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల

- నెలకు చెల్లించాల్సిన కిరాయి రూ.1,35,680
- రెండు సంవత్సరాలుగా విడుదలకాని బడ్జెట్
- అసౌకర్యాల నడుమ విద్యార్థులకు బోధన

కాజీపేట సెంటర్: జిల్లాలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పలు పాఠశాలలను ఇప్పటికే మూసివేశారు. గత ప్రభుత్వం మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమం పేరుతో స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వీటి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ఈనెల 10వరకు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. కానీ, జిల్లాలోని కొన్ని పాఠశాలలు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. నగరంలో 7 పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 3 పాఠశాలలు సంవత్సరాలుగా సొంత భవనాలకు నోచుకోవడం లేదు. అరకొర వసతుల మధ్య బోధన చేస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, బ్లాక్‌బోర్డులు లేవు. బెంచీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చొని పాఠాలు వింటున్నారు. రెండు సంవత్సరాల నుంచి అద్దె బడ్జెట్ ప్రభుత్వం నుంచి రావడం లేదు. నెలకు 1,35,680 అద్దె చెల్లించాల్సి ఉంది.

మురికివాడల పిల్లలు విద్యకు దూరం..

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలనే లక్ష్యం మంచిదే. కానీ, జిల్లా అధికారులు దృష్టి సారించపోవడంతో మురికివాడల్లోనే అనేక మంది పిల్లలు విద్యకు దూరమవుతున్నారని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న పాఠశాలల సమస్యలను కలెక్టర్ పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం..



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నాం. ఆ పాఠశాలల్లో సమస్యలను గుర్తించాం. త్వరలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తాం.

- డి.వాసంతి, జిల్లా విద్యాశాఖ అధికారి

విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పూలతీగ



చెన్నారావుపేట: పూలతీగ.. విద్యుత్ స్తంభం తీగలకు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఇది ఎక్కడో అనుకుంటున్నారా.. మండల కేంద్రం నుంచి పాకాల వాగుకు వెళ్లే ప్రధాన రహదారిపై (దోని నారాయణ ఇంటి సమీపంలో) ఉన్న విద్యుత్ స్తంభానికి పూలతీగ అల్లుకుపోయింది. అటుగా వెళ్తున్న బాటసారులు, వాహనదారులు, చిన్నారులు పూలతీగను ముట్టుకుంటే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభానికి అల్లుకున్న పూల తీగను వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, వర్షపు నీరు నిలవకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఆదివారం హనుమకొండలోని కమిషనర్ క్యాంపు కార్యాలయంలో బల్దియాకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులతో అభివృద్ధి పనుల పురోగతి, వర్షాకాలంలో ముంపు నివారణ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై కమిషనర్ సమీక్షించారు. సమర్థవంతంగా నిర్వహించేందుకు సూచనలిచ్చారు. బల్దియా వ్యాప్తంగా స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఇప్పటికైనా సీరియస్‌గా దృష్టిసారించి, సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ముంపు నివారణ చర్యలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వెల్లడించారు. నగరంలోని బంధం చెరువు ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా గతంలో సామర్థ్యం మేరకు కల్వర్టులు నిర్మించకపోవడం వల్ల హనుమకొండలోని కొన్ని ప్రాంతాలు భారీ వర్షాలు కురిస్తే జలమయమవుతున్నాయని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు కృష్ణారావు ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, సంజయ్ కుమార్, డీఈలు రవికుమార్, సారంగం, రవి కిరణ్, ఎస్‌ఎఫ్‌ఓ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కోతులు.. వెతలు!

వీరంగం సృష్టిస్తున్న వానరాలు

- భయంతో వణుకుతున్న నగర ప్రజలు
- నియంత్రించడంలో బల్దియా నిర్లక్ష్యం



నగరంలో సంచరిస్తున్న కోతులు

వరంగల్ అర్బన్: కోతులు ఇళ్లలోకి చొరబడి వీరంగం సృష్టిస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ నగరంలో హల్‌చల్ చేస్తున్నాయి. వీటి కారణంగా పిల్లలు, పెద్దలు బయటకు రావాలంటే జంకుతున్నారు. రోడ్లు, భవనాలు, గోడలపై ఉంటూ చేతుల్లో తినే పదార్థాలేమున్నా.. దాడి చేసి లాక్కెళ్తున్నాయి. తలుపులు తెరిచి ఉంటే.. చొరబడి ఆగమాగం చేస్తున్నాయి. ఈకోతుల బెడద భరించలేకపోతున్నామంటూ ప్రజలు బల్దియా అధికారులకు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, జవాన్లకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కోతుల దాడుల్లో గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. నగరంలోని దాదాపు అన్ని కాలనీల్లో పరిస్థితి కనిపిస్తోంది.

పేరుకే పట్టివేత

కోతులను పట్టడానికి బల్దియా ఏటా టెండర్ పిలవడం నామమాత్రంగా పట్టడం, తరలించడం ఇదో మామూలు వ్యవహారంగా మారింది. కాంట్రాక్టర్ పట్టింపులేనితనం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నిర్లక్ష్యం కారణంగా, అడవుల్లో వదిలేయకపోవడం వల్ల వీటి సంతతి రెట్టింపవుతోంది. వారానికికోసారి కోతులను పట్టి భూపాలపల్లి, కాళేశ్వరం, ఏటునాగారం, పాకాల కొత్తగూడ అడవుల్లోకి తరలించాలి. ఇందుకు బల్దియా ప్రత్యేక వాహనాన్ని సమకూరుస్తోంది. కానీ.. నామమాత్రపు పట్టివేతతో నగరంలో కోతుల నుంచి ప్రజలకు విముక్తి దొరకడం లేదు.

తీవ్రత ఎక్కడంటే..

వరంగల్ నగరంలోని గిర్మాజీపేట, గోవిందరాజు గుట్ట, చార్‌బౌళి, మట్టెవాడ, పిన్నవారి వీధి, ఎల్లం బజార్, మండిబజార్, పాపయ్యపేట, పోతన నగర్, ఎల్‌బీనగర్, కాశిబుగ్గ, అబ్బనికుంట, చింతల్, శివనగర్, కరీమాబాద్, ఎస్‌ఆర్‌ఆర్‌తోట, రామన్నపేట, హనుమకొండలోని కాకాజీ కాలనీ, పింజర్ల వీధి, శ్రీనివాస కాలనీ, పద్మాక్షి కాలనీ, నాగుల

కాజీపేట టౌన్‌లో సింగరేణి హాల్టింగ్ ఎత్తివేత

కాజీపేట రూరల్ : రైల్వే ఇంజనీరింగ్ నిర్మాణ పనుల కారణంగా కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో సింగరేణి రైళ్లకు తాత్కాలికంగా హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు ఆదివారం రైల్వే అధికారులు తెలిపారు. భద్రాచలంరోడ్-బల్లార్షా (17033) వెళ్లే సింగరేణి ప్యాసింజర్, సిర్పూర్‌కాగజ్‌నగర్-భద్రాచలంరోడ్ (17034) వెళ్లే సింగరేణి ప్యాసింజర్‌లకు జూన్ 30వ తేదీ వరకు కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్‌ను ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

బదిలీలకు రంగం సిద్ధం

- పోలీస్ శాఖలో మరోసారి భారీగా ట్రాన్స్‌ఫర్లు..!
- సీపీ నుంచి ఎస్సై వరకు.. స్థానచలనానికి కసరత్తు
- పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు డీసీపీలు, ఐదుగురు ఏసీపీలు
- సుమారు 18 మంది ఇన్‌స్పెక్టర్లకు బదిలీ అవకాశం?
- హాట్ టాపిక్‌గా 'లేఖ'ల వ్యవహారం



సాక్షిప్రతినిధి, వరంగల్: పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో మరోమారు పోలీసుశాఖలో భారీగా బదిలీల పర్వానికి తెరలేస్తోంది. ఉమ్మడి వరంగల్‌లో ఎస్సై కేడర్ నుంచి ఎస్పీ, సీపీల వరకు స్థానచలనం ఖాయమన్న ప్రచారం పోలీసువర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల మార్గదర్శకాల నేపథ్యంలో మార్చి నెలలో పెద్ద ఎత్తున బదిలీలు చేశారు. అంతకు ముందు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగానూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బదిలీలు జరిగాయి. సుదీర్ఘ కాలం ఒకేచోట పనిచేసిన వారిని ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ చేశారు. సొంత జిల్లాల్లో నియమించకుండా.. అప్పటికే పనిచేస్తుంటే వారిని మరో జిల్లాకు పంపించారు. చిన్న జిల్లాలు కావడం.. ఒక పార్లమెంట్ స్థానం పరిధిలో మూడు, నాలుగు, ఆరు జిల్లాలు ఉండడం తదితర కారణాలతో ఎన్నికల మార్గదర్శకాలకు లోబడి పోలీసులను బదిలీ చేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికార పార్టీ ప్రజాప్రతినిధుల 'ఆమోదం' మేరకు పోస్టింగ్‌లు పొందిన పోలీస్ అధికారులు.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మారాల్సి వచ్చింది. ఆ సమయంలో బదిలీ అయిన వారు తిరిగి పాత పోస్టుల్లో కొనసాగేందుకు పైరవీలు చేసుకుంటుండగా.. ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా కమిషరేట్‌లో ఖర్చీఫ్ వేసుకుంటున్నారు. దీంతో పాత స్థానాలను ఆశిస్తున్న పలువురు ఏసీపీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ)లలో ఉత్కంఠ నెలకొంది.

పోలీస్ బాస్ మార్పుపైనా ప్రచారం..?

ఎన్నికల సంఘం ఆదేశానుసారం షెడ్యూల్ విడుదల అనంతరం పలు కమిషనరేట్‌లు, జిల్లాలకు నాన్ క్యాడర్ అధికారుల స్థానంలో ఐపీఎస్ అధికారులను పోలీస్ బాస్‌లుగా నియమించారు. ఈ క్రమంలో వరంగల్ సీపీగా ఉన్న ఏవీ రంగనాథ్ 2023 అక్టోబర్ 11న బదిలీ కాగా.. ఆయన స్థానంలో అంబర్ కిషోర్ ఝాను నియమించారు. గతంలోనూ జిల్లాలో పని చేసిన అనుభవం ఉన్న అంబర్ కిషోర్ ఝాకు సక్సెస్‌ఫుల్ అధికారిగా పేరున్నా.. ఈ బదిలీల్లో స్థానచలనం తప్పదన్న చర్చ కాంగ్రెస్ కీలక నేతల్లో సాగుతోంది. ఒకవేళ ఆయనను మార్చితే గతంలో సీపీగా పనిచేసిన ఏవీ రంగనాథ్, ప్రకాశ్‌రెడ్డిల్లో ఎవరో ఒకరిని నియమించవచ్చంటున్నారు. అలాగే వరంగల్ కమిషనరేట్‌లో కీలకమైన సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్‌లకు సంబంధించి ఇద్దరు డీసీపీల బదిలీ అనివార్యం అంటున్నారు. ఈ మూడు జోన్ల పరిధి 9 సబ్ డివిజన్లలో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు(ఏసీపీ)లు పలువురు గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్ నేతలతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఐదుగురిపై బదిలీ వేటు పడుతుందని అంటున్నారు. వీరి స్థానంలో ఎవరిని నియమించాలి? అన్న చర్చకు ఆస్కారం లేకుండా ప్రజాప్రతినిధులు లేఖలు కూడా ఇచ్చినట్లు పోలీసు సర్కిళ్లలో చర్చ జరుగుతోంది. అలాగే అసెంబ్లీ ఎన్నికల నుంచి లూప్‌లైన్‌లో ఉన్న సీఐ నుంచి ఏసీపీ స్థాయి అధికారులు కీలక ఠాణాలు, సబ్ డివిజన్లకు లేఖలు పొందినట్లు తెలుస్తోంది.

ఎస్‌హెచ్‌ఓల కోసం పోటాపోటీ..

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి కీలక ఠాణాల్లో ఎస్‌హెచ్‌ఓలుగా పోస్టింగ్ కోసం ఇన్‌స్పెక్టర్లు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కోరుకున్నచోట పోస్టింగ్ కొట్టేందుకు 'మామూలు'గా 'లేఖ'లు కూడా సంపాదించినట్లు ప్రచారం. అసెంబ్లీ ఎన్నికల తర్వాత.. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన బదిలీల్లో ముగ్గురు కీలక ప్రజాప్రతినిధులు తమ తమ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ వర్గాలు సర్కారుకు గోప్యంగా నివేదిక ఇవ్వడం.. ఆ తర్వాత వాటిపై చర్చ కూడా జరిగింది. ఇదిలా ఉండగా ఈసారి పెద్ద ఎత్తున జరిగే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌హెచ్‌ఓ)ల బదిలీల నేపథ్యంలో పాత స్థానాలను కైవసం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇదే సమయంలో సిద్దిపేట, పూర్వ కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 16 మంది ఇన్‌స్పెక్టర్‌లో కమిషనరేట్‌కు రావడానికి రిక్వెస్ట్ పెట్టుకున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలోని సుమారు 18 మంది ఇతర జిల్లాలకు వెళ్లనున్నారన్న ప్రచారం ఉంది. ఈనేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలకు స్థానచలనం తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో మట్టెవాడ, మిల్స్‌కాలనీ, కేయూ క్యాంపస్, ఇంతేజార్‌గంజ్, స్టేషన్ ఘన్‌పూర్, హసన్‌పర్తి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, రఘునాథపల్లి, ఆత్మకూరు, గీసుకొండ, నర్సంపేట టౌన్, నర్సంపేట రూరల్, పర్వతగిరి, పాలకుర్తి, సుబేదారి, ఏనుమాముల తదితర ఠాణాలకు పలువురు ఇన్‌స్పెక్టర్లు లేఖలు పొందడం చర్చనీయాంశమవుతోంది. కాగా.. వీరితో పాటు హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ సీఐలు, రెండు మహిళా పోలీస్ స్టేషన్ సీఐలను బదిలీ చేయనున్నారని చర్చ జరుగుతోంది. ఎస్సైలు ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్న పలు పోలీస్ స్టేషన్లకు కొత్త ఎస్సైలు రానున్నారు. రెండు, మూడు రోజుల్లో ఈ బదిలీల ప్రక్రియ పూర్తయి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని పోలీసువర్గాల సమాచారం.

హేమాచలుడి సన్నిధిలో భక్తుల సందడి



హేమాచలుడిని దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు గుట్టపై గల శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కార్లు, ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో ఉదయాన్నే గుట్టపైకి చేరుకున్న భక్తులు ఆలయ సమీపంలోని పవిత్ర చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి హేమాచల కొండపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ కారంపుడి పవన్‌కుమార్ ఆచార్యులు స్వామివారికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పూజలు నిర్వహించి నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ పూజారులు గోత్ర నామాలతో ప్రత్యేక అర్చనలు జరిపించి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణం వివరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి హేమాచల క్షేత్రం వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

ఎన్నిక


తీగల జీవన్‌గౌడ్

వరంగల్ లీగల్ : ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఎల్‌బీ నగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టు అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తీగల జీవన్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జీవన్‌గౌడ్ గతంలో ఉమ్మడి వరంగల్ బార్ అసోసియేషన్ సెక్రెటరీగా, ప్రస్తుతం వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన ఎన్నికపై బార్ కౌన్సిల్ సభ్యులు, అసోసియేషన్ల బాధ్యులు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

కారు ఢీ.. ముగ్గురికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం


ఘటనా స్థలంలో క్షతగాత్రులు


అదుపు తప్పిన కారు

పెద్దవంగర : కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన కుటుంబ సభ్యులు కారులో యాదగిరిగుట్టకు దైవదర్శనానికి వెళ్లారు. మార్గమధ్యలో ఉన్న పాలకుర్తి సోమేశ్వర స్వామిని దర్శించుకొని తిరిగి సొంతూరికి వెళ్తున్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల అశోక్‌తో పాటు ఆయన బంధువులు కుందూరు రవి, సురేష్ గ్రామ శివారులోని రోడ్డు వెంట తమ ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నారు. అవుతాపురం శివారులోకి కారు వస్తున్న క్రమంలో టైరు పంచర్ కావడంతో అదుపుతప్పి ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సురేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో హనుమకొండకు రెఫర్ చేశారు. ఈ సంఘనపై స్థానిక ఎస్సైని వివరణ కోరగా తమకు ఏలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

డీసీఎం వ్యాన్, ఆటో ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు



నడికూడ : డీసీఎంవ్యాన్ ఆటో ఢీ కొని ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నర్సక్కపల్లె వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన జూపాక శంకర్ తన ఆటోలో భార్య సునీత, కూతురు నందినితో పరకాల నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నర్సక్కపల్లె వద్దకు చేరుకోగానే వెనుక నుంచి డీసీఎం వ్యాన్ అదుపుతప్పి ఢీ కొట్టి డివైడర్ వైపునకు దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయమై పరకాల పోలీసులను సంప్రదించంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చింత చిగురు.. తింటే నోరూరు

షుగర్ బాధితులకు దివ్యౌషధం

- మార్కెట్‌కు తీసుకొస్తున్న వ్యాపారులు
- కొనేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు


చింత చిగురు కోసుకుంటున్న ప్రజలు

ఖానాపురం : చింత చిగురు.. పేరు వింటేనే నోట్లో లాలాజలం ఊరుతుంది. కొంచెం వగరుగా.. పుల్లగా ఉండే చింత చిగురు ఎన్నో ఔషధగుణాలను కలిగి ఉంది. ప్రస్తుత సీజన్‌లో లభించే చింత చిగురుకు మంచి డిమాండ్ ఉంటుంది. చికెన్, మటన్ తదితర కూరల్లో చింతచిగురును కలిపి వండుకుంటే ఆహా భలే రుచికరంగా ఉంటాయి. వేసవిలో ఆకురాలి మోడుగా మిగిలిన చింత చెట్టుకు చిగురు వస్తుంటుంది. మే చివరి నుంచి జూలై వరకు లభించే చింత చిగురు కోసం వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల నుంచి లేలేత చింత ఆకును సేకరిస్తుంటారు. అనంతరం వాటిని మార్కెట్లలో విక్రయాలకు సైతం తీసుకు వస్తున్నారు. చింత చిగురు మార్కెట్‌కు అమ్మకానికి వస్తుండటంతో ప్రజలు సైతం కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం విరివిగా ఉండే చింతచెట్ల వద్దకు వెళ్లి సాహసాలు చేస్తూ మరీ చింతచిగురును తెచ్చుకుంటున్నారు. కేవలం సీజనల్‌లో లభించే చిగురు కోసం మార్కెట్‌లో ఎంత ధర అయినా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

చాలా రుచికరమైనది



మార్కెట్‌కు వెళ్లి చింత చిగురును కొనుగోలు చేస్తా. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినప్పుడు చింత చెట్టు వద్దకు వెళ్లి తెచ్చుకుంటాం. సీజన్ సమయంలో ఇంట్లో వండుకునే కూరల్లో కచ్చితంగా చింత చిగురును వినియోగిస్తాం. చింత చిగురు వినియోగించిన కూరలు రుచికరంగా ఉంటుంది. సీజన్ సమయంలో ఇంట్లో వినియోగించడానికి కుటుంబమంతా ఆసక్తి చూపిస్తాం.

\- చెల్పూరి శ్రీనివాస్

అన్ని వంటకాల్లోనూ వినియోగం..

- చింత చిగురును అన్ని రకాల వంటల్లో కలుపుకొని వాడుకోవడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా భేదం లేకుండా చింతచిగురుతో కలిగే ఉపయోగాలు తెలుసుకొని వంటకాల్లో వినియోగిస్తున్నారు. చింతచిగురును శాకాహారంతో పాటు మాంసాహారం, పప్పు, దోసకాయ, టమాట వంటి కూరల్లో అధికంగా కలుపుకొని వంటలు చేసుకుంటారు. చింత చిగురును తినడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని వైద్యులు సైతం సూచిస్తున్నారు. చిగురు వల్ల ఉపయోగాలు..
- చింత చిగురులో ప్రోటీన్లు, పీచు పదార్థం, పాస్పరస్, మెగ్నీషియం, విటమిన్–సీ లభిస్తాయి. అలాగే యాంటీ బాక్టీరియా ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది
- మధుమేహం(షుగర్)ను, బీపీని నియంత్రించి బాధితులకు మేలు చేస్తుంది. కాలేయాన్ని కాపాడుతుంది.
- జీర్ణాశయ సంబంధ వ్యాధులను తగ్గించడండలో చింతచిగురు చాలా దోహదపడుతుంది.
- శరీరంలో ఎర్రరక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది.
- చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- గుండె జబ్బులు రాకుండా ఉపయోగపడుతుంది.
- తరుచు చింత చిగురు తినడం వల్ల ఎముకల దృఢత్వంగా ఉంటాయి.

చింతచిగురులో ఔషధాలు మెండు



చింత చిగురును కూరల్లో వినియోగించుకోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. మహిళల్లో నెలసరి సమస్యలు దూరం చేస్తుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి విముక్తి కలిగిస్తాయి. థైరాయిడ్ నియంత్రణకు దోహదపడుతుంది. సీజనల్ వ్యాధులను సైతం ఎదుర్కోవడానికి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన ప్రజలు సీజనల్‌లో లభించే చింతచిగురును విరివిగా వాడుకోవాలి.

\- శ్రీలత, ఆయుర్వేద వైద్యురాలు, బుధరావుపేట

పెద్దమ్మ ఆలయంలో చోరీ

- రూ.50 వేల నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాల అపహరణ

కమలాపూర్ : కమలాపూర్ మండలంలోని అంబాలలో గల పెద్దమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీ పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. పోలీసులు, ముదిరాజ్ కులస్తుల కథనం ప్రకారం.. అంబాల గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి గుడిలోకి చొరబడి అమ్మవారికి అలంకరించిన సుమారు రూ.30 వేల విలువ గల ముక్కు పుడక, పుస్తెలు, ఒడ్డాణం తదితర బంగారు, వెండి ఆభరణాలతో పాటు హుండీని ఎత్తుకెళ్లి పగులగొట్టారు. అందులోని సుమారు రూ.50 వేల నగదు అపహరించుకెళ్లినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రస్వామి క్లూస్ టీంతో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. కాగా ఈ చోరీ ఘటన మొత్తం ఆలయంలోని సీసీకెమెరాలో రికార్డ్ అయిందని, నిందితులు తమను ఎవరూ గుర్తు పట్టకుండా ముఖానికి ముసుగు ధరించి చాకచక్యంగా చోరీకి పాల్పడ్డట్లు సీసీ ఫుటేజీని చూస్తే తెలుస్తోంది. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోయిని రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరభద్రస్వామి తెలిపారు.


సీసీ టీవీలో రికార్డ్ అయిన చోరీ ఘటన

కొట్టి చంపి.. ఆపై పరారీ

> ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల దారుణాలకు ఒడిగట్టారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పులలో తనయుడి చేతిలో తల్లి హత్యకు గురైంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో భార్యభర్తలు గొడవ పడగా తెల్లవారేసరికి విగతజీవిగా మారింది.

తల్లిపై మంచం పట్టెతో తనయుడి దాడి

శాయంపేట : చింతచెట్టు విషయంలో ఇరువురి మధ్య గొడవ కారణంగా ఓ వృద్ధురాలు తనయుడి చేతిలో బలైంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం మండలంలోని కొప్పులకు చెందిన మోతే తిరుపతి రెడ్డి ఇంటి పక్కనే ఉన్న చింత చెట్టు విషయంలో బేతు జయపాల్ రెడ్డితో శనివారం గొడవపడ్డాడు. గమనించిన తిరుపతి రెడ్డి భార్య నాగరాణి గొడవ సద్దుమణిగేందుకు భర్తను ఇంట్లోకి తీసుకువెళ్లింది. ఆవేశంతో ఉన్న తిరుపతి రెడ్డి భార్యను కొట్టేందుకు యత్నించగా అతని తల్లి మోతే అమృతమ్మ(85) అడ్డుకునేందుకు వచ్చింది. కోపంతో ఉన్న తిరుపతి రెడ్డి క్షణికావేశంతో పక్కనే ఉన్న మంచం పట్టెతో తల్లి తలపై కొట్టగా బలమైన గాయమై రక్తస్రావమైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం పరకాలలోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. వెంటనే వరంగల్‌లోని ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆమె మృతి చెందింది. తన తల్లిని సోదరుడు తిరుపతి రెడ్డి మంచం పట్టెతో కొట్టి హత్య చేశాడని అమృతమ్మ కూతురు దూదిపాల రాణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. నిందితుడు తిరుపతి రెడ్డి పరారీలో ఉన్నట్లు, సీఐ రంజిత్ రావు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


అమృతమ్మ(ఫైల్)

భార్యాభర్తల మధ్య గొడవ..


మీరా మృతదేహం

నెక్కొండ : బతుకుదెరువు కోసం భవన నిర్మాణ కార్మికులుగా చేరిన దంపతులు.. భోజనాల అనంతరం బిల్డింగ్ పై నిద్రించేందుకు వెళ్లి గొడవపడ్డారు. ఈ క్రమంలో భార్య మృతి చెందగా భర్త పరారీలో ఉన్నాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా ఉదయగిరి మండల కేంద్రానికి చెందిన భార్యభర్తలు మహ్మద్ మీరా (45) ఎస్‌జీ.అరాఫత్‌అలీ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నారు. కొంత కాలంగా వీరిద్దరు నెక్కొండలోని ఎస్టీ కాలనీకి చెందిన తురక వెంకటేశ్వర్లు అనే సుతారి వద్దని పనికి కుదిరారు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనాలు చేసిన తర్వాత బిల్డింగ్‌పై నిద్రించేందుకు వెళ్లి, గొడవ పడ్డారు. కాగా మేస్త్రీతో పాటు తోటి కార్మికులు వెళ్లి సర్ది చెప్పారు. ఆదివారం ఉదయం తాపీ మేస్త్రీ భార్య లక్ష్మి వారిని నిద్రనుంచి లేపేందుకు వెళ్లి చూడగా మీరా మృతి చెంది ఉండగా అరాఫత్‌అలీ కనిపించ లేదు. ఈ విషయాన్ని మేస్త్రీకి తెలుపగా ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో నెక్కొండ సీఐ చంద్రమోహన్ సంఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. మేస్త్రీ ఫిర్యాదు మేరకు అనమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త అరాఫత్ అలీ పరారీలో ఉన్నాడని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

భూపాలపల్లి అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి భూపాలపల్లి మండలం కమలాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై ప్రసాద్ కథనం ప్రకారం.. కమలాపూర్ గ్రామానికి చెందిన రేగళ్ల నరేష్ (29), ప్రమోద్ (21), సిద్ధు గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై బహిర్భూమికి వెళ్లి వస్తున్నారు. కాగా రోడ్డు దాటుతున్న క్రమంలో వెనకాల నుంచి వస్తున్న టీఎస్ 25సీ 9999 కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. దీంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రమోద్ వరంగల్‌కు తరలిస్తున్న క్రమంలో మృతిచెందగా, సిద్ధు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

రఘునాథపల్లి : కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఫతేషాపూర్‌లో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫతేషాపూర్ గ్రామానికి చెందిన చిరబోయిన సత్తమ్మ (68), కూతురు మాధవితో కలిసి జీవిస్తోంది. ఆరునెలల క్రితం సత్తమ్మకు క్యాన్సర్ రావడంతో తీవ్ర ఇబ్బంది పడుతోంది. అలాగే కడుపులో కణతి కారణంగా బాధ భరించలేక ఇదివరకే రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కాగా ఆదివారం ఉదయం మళ్లీ కడుపు నొప్పి రావడంతో బాధ భరించలేక సత్తమ్మ బయటకు వెళ్లి వస్తానని కూతురుకు చెప్పి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి అందులో దూకింది. తల్లి కోసం స్థానికులతో కలిసి కూతురు గాలిస్తుండగా బావి ఒడ్డున చెప్పులు, శాలువా ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మోటర్లతో బావిలోని నీటిని తోడి స్థానికులతో కలిసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..


ప్రశాంత్ (ఫైల్)

మొగుళ్లపల్లి : ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మెట్టుపల్లిలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మెట్టుపల్లికి చెందిన కోటగిరి ప్రశాంత్ (29) గతంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. ఇటీవల భూపాలపల్లిలో అప్పు తెచ్చి సొంతగా ల్యాబ్ పెట్టుకున్నాడు. కాగా ల్యాబ్ సరిగా నడవక పోవడంతో తెచ్చిన అప్పు ఎక్కువైంది. దీంతో తెచ్చిన అప్పు ఎలా తీర్చాలని కుటుంబ సభ్యులతో చెబుతుండే వాడు. అయితే స్నానం చేస్తానని భార్యతో చెప్పి ఇంటి వెనుకకు వెళ్లాడు. సమయం గడుస్తున్న ప్రశాంత్ ఇంట్లోకి రాకపోవడంతో భార్య తలుపు తీసే ప్రయత్నం చేయగా గడియ వేసి ఉంది. దీంతో ఆమె తలుపు సందులో నుంచి చూడగా జామ చెట్టుకు ఉరివేసుకొని ఉన్నాడు. దగ్గరికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపేట–కోమటిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు గుర్తించారు. ఎస్సై మొహినుద్దీన్ కథనం ప్రకారం.. ఆదివారం సుమారు 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడి నడుము భాగం కట్ అయి రెండు ముక్కలుగా, తల సగం వరకు తెగి పట్టాలపై పడి ఉందని, ఎడమ చేతిపై చెట్టు ఆకారం పచ్చబొట్టుగా ఉందని వివరించారు. మృతుడి ఎత్తు 5.5 కలిగి, చామనచాయ రంగులో ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురికి తరలించి అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ పోలీస్‌స్టేషన్ 87126 58609లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వరంగల్ చిన్న బ్రిడ్జి సమీపంలో..

కాశిబుగ్గ : వరంగల్ చిన్న బ్రిడ్జి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

దళితుల ఆర్థికాభివృద్ధి

ఎస్సీ కార్పొరేషన్ ప్రత్యేక భూమిక

- బ్యాంకు లింకేజీతో సబ్సిడీ రుణాలు
- పేదలకు మూడెకరాల భూమి పంపిణీ
- హనుమకొండ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత


మాధవీలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, హనుమకొండ జిల్లా



కాజీపేట అర్బన్ : స్వయం ఉపాధితో షెడ్యూల్డ్ కులాలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రత్యేక భూమిక పోషిస్తోంది. తెలంగాణ రాష్ట్రం అవతరించిన దశాబ్ద కాలంలో ఎకనామిక్ సపోర్ట్ స్కీంలో భాగంగా ప్రభుత్వం బ్యాంకు లీకేజీ సబ్సిడీ రుణాలు అందజేసింది. వంద శాతం సబ్సిడీతో పెట్టి లోన్స్, ల్యాండ్ పర్చేస్, దళితబంధు, పాడి రైతులను ప్రోత్సహించేందుకు గేదెల పంపిణీ వంటి పథకాలతో ముందుకు సాగుతున్నామని హనుమకొండ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత పేర్కొన్నారు. ఆదివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ఈఎస్ఎస్‌తో లింకేజీ రుణాలు..

బ్యాంకు లింకేజీతో రూ.ఒక లక్ష నుంచి రూ.12 లక్షల వరకు సబ్సిడీ రుణాలను ఎకనామిక్ సపోర్ట్ స్కీం (ఈఎస్ఎస్) ద్వారా అందజేశారు. 2014–15 ఆర్థిక సంవత్సరానికి 287 మందికి, 2015–16కు 1,417 మందికి, 2016–17కు 394 మందికి, 2017–18కు 1,151 మందికి, 2018–19కి 168 మందికి, 2020–21 ఆర్థిక సంవత్సరానికి 64 మందికి సబ్సిడీ రుణాలు మంజూరు అయ్యాయి. బ్యాంకు లింకేజీ లేకుండా వంద శాతం సబ్సిడీతో రూ.50 వేల చొప్పున పెట్టి లోన్స్‌తో 228 మంది లబ్ధిపొందారు.

దళితులకు అండగా 'దళిత బంధు'..

దళితులకు అండగా నిలిచేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత బంధు స్కీంకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్వయం ఉపాధితో ముందుకు సాగేందుకు పైలట్ ప్రాజెక్టుగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో కమలాపూర్ మండంలో ప్రారంభించారు. అదేవిధంగా హుజూరాబాద్ నియోజకవర్గంలో 3,931 మందికి, పరకాల నియోజకవర్గంలో 70, వరంగల్ పశ్చిమలో 100, వర్ధన్నపేటలో 47, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 25, భూపాలపల్లిలో 10 మందికి రూ.10 లక్షల చొప్పున అందజేశారు.

వరికోలులో ముగ్గురికి భూమి పంపిణీ

పేద దళితలకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేసేందుకు 2021–22లో ఎస్సీ కార్పొరేషన్‌లో ల్యాండ్ పర్చేస్ స్కీం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా పరకాల మండలం వరికోల్ గ్రామంలో మూడు ఎకరాల భూమిని 22 లక్షల రూపాయలతో కొనుగోలు చేసి ముగ్గురు పేద దళితులకు ఎకరం భూమి చొప్పున అందజేశారు.

మినీ డెయిరీతో పాడి రైతులకు ప్రోత్సాహం..

జిల్లాలోని పేద పాడి రైతులను ప్రోత్సహించేందుకు 2018–19 ఆర్థిక సంవత్సరంలో పైలట్ ప్రాజెక్టుగా మినీ డెయిరీ స్కీంకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆత్మకూరులో 67 మందికి, దామెరలో 25 మందికి, ధర్మసాగర్‌లో 12 మందికి, వేలేరులో 32, హసన్‌పర్తిలో 56, ఐనవోలులో 54 మంది పాడి రైతులకు యూనిట్లు పంపిణీ చేశారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం


జి.నవీన్ పి.రాకేష్‌కుమార్ జె.స్నేహిత్‌సందేశ్ వి.రాంబాబు వి.వేదవంచన్‌రెడ్డి శ్రేతన్‌రెడ్డి


బోడ దినేష్ ఎం.వెంకటేశ్వర్లు ఎస్.అరుణ్ సింగ్

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు వెల్లడించారు. జాతీయ స్థాయి అన్ని కేటగిరీల్లో కలిపి జి.నవీన్ 8వ ర్యాంకు, పి.రాకేష్‌కుమార్ 36, స్నేహిత్‌సందేష్ 123, వి.రాంబాబు 125, వి.వేదవంచన్‌రెడ్డి 127, జె.శ్రేతన్‌రెడ్డి 133, ఎస్.అరుణ్ సింగ్ 135, బోడ దినేష్ 157, మాలోత్ వెంకటేశ్వర్లు 185, దాసరి కార్తీక్ 299, తిలావత్ అఖిల్‌నాయక్ 323, కె.శ్రీరామ్‌రెడ్డి 324వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఓపెన్ అన్ని కేటగిరీలు కలిపి 450, 598, 621, 654, 689, 737, 737, 751, 901, 966తో పాటు అనేక ర్యాంకులు వచ్చాయని వివరించారు. భవిష్యత్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. హైస్కూల్, జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యతో ప్రతి ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఐపీఈ, జేఈఈ మెయిన్స్, టీజీఎంసెట్, నీట్‌లోనూ విశిష్టమైన మార్కులు, ర్యాంకులతో తమ విద్యార్థులు అగ్రభాగాన నిలిచారని, ఈ ఫలి తాలు స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు.

జేఈఈ అడ్వాన్స్‌లో 'శివాని' హవా


కె.పృథ్వీరాజ్ బన్నీ థామస్

హసన్‌పర్తి: ఆదివారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్–2024 ఫలితాల్లో వరంగల్ మహానగరంలోని శివాని కళాశాల విద్యార్థుల హవా కొనసాగింది. జాతీయ స్థాయిలో విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారని శివాని విద్యా సంస్థల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి తెలిపారు. కె.పృథ్వీరాజ్ 105 ర్యాంక్, బి.బన్నీ 286, బి.థామస్ 483, ఎం.కిశోర్ 1,054, డి.అఖిల్ 1,225, బి.నోయల్ 1,341, బి.అశోక్ 1,671 ర్యాంకు సాధించినట్లు స్వామి చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

- క్రానిక్ లివర్ వ్యాధితో బాధపడుతున్న యువకుడు
- ఆదుకోవాలని వేడుకోలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రహమాన్

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన యువకుడు ఎండీ రహమాన్ క్రానిక్ లివర్ వ్యాధితో బాధపడుతూ ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. కడిపికొండకు చెందిన ఎండీ.ఖాజా, షరీఫా దంపతుల మొదటి కుమారుడు రహమాన్ ఐదేళ్లుగా కామెర్లతో బాధపడుతున్నాడు. ఆస్పత్రికెళ్లి పరీక్షించుకోగా.. క్రానిక్ లివర్ వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. రహమాన్ తండ్రి ఖాజా రైల్వే శాఖలో గ్యాంగ్‌మన్‌గా కాజీపేటలో విధులు నిర్వహిస్తూ ఏడాది క్రితం మృతి చెందాడు. ఎంబీఏ పూర్తి చేసిన రహమాన్ తన తండ్రి వృత్తిలో (గ్యాంగ్‌మన్‌గా) చేరాడు. తనకున్న వ్యాధిని నయం చేసుకునేందుకు సొంత ఇంటిని సైతం అమ్మేశాడు. రైల్వేలో చేరి ఆర్నెళ్లు గడవక ముందే వ్యాధి తీవ్రతతో మంచానికే పరిమితమయ్యాడు. హైదరాబాద్‌లోని గ్లీన్ ఈగల్స్ ఆస్పత్రిలో చేరడంతో వైద్యులు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ మాత్రమే దారి అని, అందుకు రూ.42.50 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. రైల్వే శాఖ అతడి ఉద్యోగాన్ని బట్టి రూ.20 లక్షలను కేటాయిస్తానని తెలిపింది. మిగతా 22.50 లక్షలు చెల్లించలేని దుస్థితిలో రహమాన్ ఉన్నాడు. రహమాన్ తమ్ముడు మజార్ దివ్యాంగుడు కాగా.. పెద్ద దిక్కైన అతడు వ్యాధి బారిన పడడంతో కుటుంబం రోడ్డున పడింది. కడిపికొండకు చెందిన అతడి మిత్రులు ఒక వీడియో ద్వారా ఫండ్ రేసింగ్‌కు ప్రయత్నిస్తున్నారు. పెద్ద మనస్సు చేసుకుని తనను ఆదుకోవాలని రహమాన్ వేడుకుంటున్నాడు. అతడికి సాయం చేయాలనుకునే వారు కింది నంబర్లలో సంప్రదించవచ్చు.

సాయం చేయాలనుకునేవారు సంప్రదించాల్సిన నంబర్లు
76608 14610
95500 69692

క్లుప్తంగా...

ములుగు జిల్లాలో నాలుగు మందుపాతరల గుర్తింపు

- అప్పటికే పేలిపోయిన 3 ఐఈడీలు
- జంతు కళేబరాలు లభ్యం


పోలీసులు గుర్తించిన మందు పాతర

వెంకటాపురం.కె (ములుగు): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం అటవీ ప్రాంతంలో పోలీసులు నాలుగు మందు పాతర (ఐఈడీ)లను గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను గుర్తించడానికి తనిఖీలు చేస్తుండగా ఈ నాలుగు మందుపాతరలను గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో మూడు పేలిపోయి ఉన్నాయని, సమీపంలో ముళ్లపంది, కొండెంగ, ఒక పెంపుడు కుక్క కళేబరాలను గుర్తించామని, మిగిలిన మందుపాతరను బాంబ్‌స్క్వాడ్ సహాయంతో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు.

ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

ఏపీ,తెలంగాణ సంయుక్త సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినతరంగా అమలు చేస్తామని తెలంగాణ పీసీసీఎఫ్ డోబ్రియాల్, ఆంధ్రప్రదేశ్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఏ సమస్య తలెత్తినా రెండు రాష్ట్రాలు సుహృద్భావ వాతావరణంలో చర్చించి నిర్ణయాలు తీసుకుని ముందుకుపోవాలని నిర్ణయించామన్నారు. ఆమ్రాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులు పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు అడవులకు సంబంధించిన సరిహద్దు సమస్యలు, నివాస నిర్వహణ, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో తీర్థయాత్రల సందర్భంగా భక్తుల తాకిడి పెరుగుతుండటంతో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. రెండు టైగర్ రిజర్వ్‌లలో ప్రత్యేకంగా తాగు నీటి కోసం ప్రత్యామ్నాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఏపీ చీఫ్ వైల్డ్ వార్డెన్ ఏకే నాయక్, ఏటీఆర్, ఎన్ఎస్‌టీఆర్ అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో హైటెక్స్‌లో వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హాజరుకానున్న దేశవిదేశాల వెడ్డింగ్ ప్లానర్లు, డిజైనర్లు



సనత్‌నగర్ (హైదరాబాద్): జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం, తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్, 3వ టీసీఈఐ ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 బియాండ్ ఇమాజినేషన్, 7వ టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం బేగంపేట పర్యాటక భవన్‌లోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఇది ఒకచోట చేర్చుతుందని, ఈ ఈవెంట్ ద్వారా వివాహాలకు దక్షిణాది నుంచి ముఖ్యమైన సహకారం, పరిజ్ఞానం, ప్రత్యేక వేదికను అందించడమే లక్ష్యమన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలోని వివిధ అంశాలపై జ్ఞానయుక్తమైన సెషన్లు ఉంటాయని, జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ కన్వెన్షన్ కోసం దేశవిదేశాల్లో ఉన్న 20కి పైగా వెడ్డింగ్ ప్లానర్లు, వెడ్డింగ్ డిజైనర్లు, వెడ్డింగ్ స్టైలిస్టులు, డెకరేటర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఈవెంట్ ఇండస్ట్రీలోని ఇతర క్రాఫ్ట్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయన్నారు. ఈవెంట్‌కు సిడ్నీ నుంచి వెండీ ఈఎల్ ఖౌరీ సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతారన్నారు. టెడ్డీ ఇమాన్యుయేల్ (ఫిలిప్పీన్స్), మైఖేల్ రూయిజ్ (ఫిలిప్పీన్స్), బ్రియాన్ టాచీ-మెన్సన్ (ఘనా) తదితరులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం దేశవిదేశాల నుంచి 700 మందికి పైగా ప్రతినిధులకు స్వాగతం పలుకుతోందన్నారు. 'ఈవెంట్ బజార్'గా పిలవబడే ఎక్స్‌పోలో 60కి పైగా స్టాల్స్‌లో గ్రాండ్ డిస్‌ప్లే ఉంటుందన్నారు. ఈవెంట్ పరిశ్రమలో ఉన్న విభిన్న ఉత్పత్తులు, సేవలు, అత్యాధునిక ట్రెండ్లను ప్రదర్శిస్తుందని చెప్పారు. ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, ఈవెంట్ సేఫ్టీ, టెక్నాలజీ పాత్ర తదితర కీలక అంశాలపై సమాంతర సెషన్లు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ రమేశ్‌నాయుడు, హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవిబురా, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 కన్వీనర్ రామ్ ముప్పన, కో-కన్వీనర్లు హిరీష్‌రెడ్డి, కుమార్‌రాజా, సుధాకర్ యారబడి, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అట్లాంటాలో 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో ఆదివారం ప్రసంగించారు. హైదరాబాద్ సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచానికి ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను రూపొందించే లక్ష్యంతో 200 ఎకరాలను ఏఐ పరిశ్రమల కోసం కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు అమెరికాలో స్థిరపడ్డ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని కోరారు.

'సైబర్' బాధితులకు రూ.7.9 కోట్లు అందజేత

- సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును ఇప్పించిన అధికారులు
- జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులు పరిష్కారం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు న్యాయం చేస్తున్నారు. ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒక్క రోజులోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.7.9 కోట్లు తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించారు. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సందర్భంలో వెంటనే సంబంధిత బ్యాంకు, సైబర్ సెక్యూరిటీ విభాగానికి చేసిన ఫిర్యాదుల ఆధారంగా నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసి న్యాయ ప్రక్రియ ద్వారా అధికారులు బాధితులకు రీఫండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అన్ని జిల్లాల పోలీసు విభాగాలు, పోలీసు కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసీఎస్‌బీలో మొత్తం 4,144 కేసులు నమోదు కాగా, ఇందులో జూన్ 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులలో బాధితులకు రూ.7.9 కోట్లు సొమ్మును తిరిగి ఇప్పించగలిగినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులు పరిష్కరించగలిగినట్టు తెలిపారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ సూచించారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి కాపాడేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని శిఖాగోయల్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపైనే ఆగిన ఊపిరి

- షాక్‌తో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి
- నాలుగు గంటలపాటు స్తంభంపైనే మృతదేహం



ఆదిలాబాద్ రూరల్: ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు కరెంట్ స్తంభం ఎక్కిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్.. దానిపైనే షాక్‌కు గురై మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా రాములుగూడలో ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామానికి చెందిన దడంజే మోతీరాం (35) కొన్నేళ్లుగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఓ ఇంటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోతీరాంను పిలిచారు. ఆయన వచ్చి సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయితే పైనుంచి వెళ్తున్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కుగురై అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మోతీరాం మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేశారు. తమకు పరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని కిందకు దించొద్దని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు అక్కడికి రావడం ఆలస్యం కావడంతో మోతీరాం మృతదేహం స్తంభంపైనే నాలుగు గంటలపాటు ఉండిపోయింది. పోలీసులు, విద్యుత్ అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మోతీరాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మోతీరాం మృతికి.. తమకు ఎలాంటి సంబంధం లేదని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన మోతీరాం తమ లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

హైవేలు రక్తసిక్తం

జాతీయ రహదారులు 44, 65పై ఘోర రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం.. ఆరుగురికి గాయాలు

ఆదివారం రాష్ట్రంలోని రెండు జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. 44వ నంబర్ హైవేపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, హైవే 65పై చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రెండు ఘటనల్లో మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

పెబ్బేరు రూరల్: వారంతా జైనమత ప్రచార బోధకులు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరిన వారిని డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడింది. 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఓ సాధువుతోపాటు ఇద్దరు సహాయకులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు స్వామీజీలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జైనమత ప్రచార బోధకులు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్, వీరికి తోడుగా సహాయకులు భగవాన్ బాయ్, హేమల్ ప్రవీణ్ షాతో పాటు మరికొందరు ఈనెల 3న హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం రంగాపురం పాఠశాలలో శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం నడక ప్రారంభించారు. గ్రామ శివారులో స్వామీజీలు వీల్‌చైర్‌లో కూర్చోగా, సహాయకులు తోసుకుంటూ వెళ్తుండగా.. కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్ బాయ్ (36), హేమల్ ప్రవీణ్ షా (40)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్వామీజీలు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్ (45) మృతిచెందారు. మరో ఇద్దరు స్వామీజీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లారీల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు..



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): జాతీయ రహదారి 65పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులో ఆదివారం జరిగింది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా దేవరిప్పరిగి తాలూకా ఉన్నాల్ వాసి హాజీ షబాజ్ తన భార్య నస్రీన్ (45), ఇద్దరు కుమారులు జునైద్, అబ్దుల్లాలతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి పని చూసుకొని సొంతూరుకు వెళ్తున్నారు. నందికంది శివారు నాగ్సాన్‌పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. వారి వెనకాలే హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ మృత్యుంజయ దుబే(45) కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో ఇటుగా జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు మరో లారీ వెళ్తోంది. దీంతో కారు.. రెండు లారీల మధ్య ఇరుక్కుని నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న నస్రీన్, ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ దుబే ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో హాజీ షబాజ్‌కు, అతని ఇద్దరు కుమారులకు, లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభా పురస్కారానికి ఎంపిక


- నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు


సాయిలత

ఏటూరునాగారం : పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబర్చి 10/10 జీపీఏ సాధించిన ఏటూరునాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీరాం బిందు సాయిలత నేడు (సోమవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనుంది. మండల కేంద్రానికి చెందిన విద్యార్థి సాయిలత స్థానిక జెడ్పీఎస్ఎస్‌లో 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివింది. మార్చి నెలలో జరిగిన టెన్త్ పరీక్షల్లో సాయిలత 10/10జీపీఏ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కాగా ములుగు జిల్లా నుంచి వందేమాతరం ప్రతిభా పురస్కారానికి ఎంపికై, రాష్ట్ర ముఖ్యమంత్రితో నేడు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననుంది. దీంతో మండల ప్రజలు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- ఎస్ఏలుగా లాంగ్వేజ్ పండిట్స్, పీఈటీలు


సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా(ఎస్ఏ) అప్‌గ్రేడ్ అయిన లాంగ్వేజ్ పండిట్స్ (తెలుగు, హిందీ, ఉర్దూ), పీఈటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఆదివారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. తెలుగు 92 మంది, హిందీ 96 మంది, ఉర్దూ నలుగురికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. అలాగే 61 మంది పీఈటీల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశారు. ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో మూడు కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఎస్ఏలుగా అప్‌గ్రేడ్ అయిన హిందీ, ఉర్దూ పండిట్ల సర్టిఫికెట్లను నారాయణగిరి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం డాక్టర్ బి.రాంధన్, డీఈఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ టి.గాయత్రి పరిశీలించారు. తెలుగు పండిట్ల సర్టిఫికెట్లను హనుమకొండ ప్రభుత్వ హై స్కూల్ హెచ్ఎం శైలజ, డీఈఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వి.సరోజిని పరిశీలన చేశారు. పీఈటీల సర్టిఫికెట్లను హసన్‌పర్తి జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నతపాఠశాల హెచ్ఎం సుమాదేవి, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ సుమలత పరిశీలించారు. ఈ సర్టిఫికెట్లను డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పర్యవేక్షించారు.

నేడు సీనియార్టీ జాబితాల వెల్లడి

హనుమకొండ జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాలను ఈనెల 10న వెల్లడించనున్నామని డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం వెల్లడించలేదని ఆయన పేర్కొన్నారు.

స్కూల్ బస్సు భద్రమేనా?


ఫిట్‌నెస్‌కు వచ్చిన ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు


సామర్థ్యపు పరీక్షలు చేస్తున్న అధికారులు

గడువు దాటితే అన్‌ఫిట్

- మే 15తో ముగిసిన ఫిట్‌నెస్ గడువు
- ఈనెల 12 నుంచి ఆర్టీఏ స్పెషల్ డ్రైవ్

ఖిలా వరంగల్ : పాఠశాలల పునఃప్రారంభ సమయం దగ్గర పడుతోంది. స్కూల్ బస్సులు భద్రమేనా..? అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కలవరపడుతున్నారు. బస్సుల ఫిట్‌నెస్ గడువు మే 15వ తేదీతోనే ముగిసింది. యాజమాన్యాలు బస్సుల మరమ్మతులు పూర్తి చేసి ఫిట్‌నెస్ పరీక్షలకు తీసుకు రావాలని ఆర్టీఏ అధికారులు నోటీసులు జారీ చేశారు.

హమ్మయ్య చేర్పించాం..

ఉదయం బస్సెక్కిస్తే..సాయంత్రానికి గాని పిల్లలు ఇంటికి రారని బాధ్యత తీరిపోయినట్లు తల్లిదండ్రులు భావిస్తున్నారు. పిల్లల బడికి వెళ్లడం ఎంత ముఖ్యమో.. తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకోవడం అంతే ముఖ్యం. చిన్నారులను పంపే బస్సు, ఆటో ఏదైనా కండిషన్‌లో ఉందా.. డ్రైవర్ పరిస్థితి.. ఇలా ఎన్నో అంశాలను నిత్యం గమనించి దృష్టి పెడితే పిల్లలు క్షేమంగా ఉంటారు. చాలా వరకు బస్సుల్లో నిబంధనలు పాటించడం లేదన్నది బహిరంగ రహస్యం.. కొన్ని పాఠశాల బస్సుల్లో డ్రైవింగ్ లైసెన్సులు లేని వారు నడపడం, క్లీనర్ లేకుండా పంపడం, పరిమితికి మించి బస్సుల్లో విద్యార్థులను ఎక్కించడం, డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపడం వంటివి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సుల తనిఖీలపై ప్రత్యేక శ్రద్ధ చూపితే యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు పాటిస్తారు.

12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం..



ఉమ్మడి జిల్లాల్లో ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయితే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు సొంత బస్సుల ఉన్నాయి. పాఠశాల బస్సుల నిర్వహణకు సంబంధించి 52 నిబంధనలు అమలు చేయాల్సి ఉంది. వీటిలో 20 నిబంధనలు పాఠశాలలకు సంబంధించినవే. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రభుత్వం పాఠశాలల బస్సులకు కొన్ని నిబంధనలు ప్రవేశ పెట్టింది. అన్ని నిబంధనలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి సామర్థ్య(ఫిట్‌నెస్) ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని రవాణాశాఖ అధికారులకు ప్రభుత్వం సూచించింది..

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం బస్సులు 1,530 ఉన్నాయి. అందులో ఇప్పటి వరకూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ పొందినవి 942 మాత్రమే. మిగిలిన 588 బస్సుల్లో త్వరగా పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. కాగా వివిధ కారణాలతో సుమారు 178 బస్సులకు ఫిట్‌నెస్‌ను తిరస్కరించారు. ఇంకా మిగిలిన బస్సులు జూన్ 12లోపు ఆన్‌లైన్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో బస్సుల వివరాలు ఇలా ఉన్నాయి..

జిల్లా	మొత్తం	ఫిట్‌నెస్ పొందినవి	ఫిట్‌నెస్ కావాల్సినవి
వరంగల్	352	212	140
హనుమకొండ	750	468	282
భూపాలపల్లి	130	82	48
ములుగు	40	15	25
జనగామ	103	76	27
మహబూబాబాద్	155	89	66
మొత్తం	1530	942	588

కొరఢా ఝుళిపిస్తాం..



ఫిట్‌నెస్ లేని ప్రైవేటు విద్యా సంస్థల బస్సులపై కొరఢా ఝుళిపిస్తాం. అనుమతులు లేని, ఫిట్‌నెస్ లేని వాహనాల్లో విద్యార్థులను తరలిస్తే వాహనం సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలకు తావివ్వకుండా టాటా ఎస్, ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలించే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా లైసెన్స్‌ను రద్దు చేస్తాం. తల్లిదండ్రులు, విద్యార్థులను పాఠశాలలో చేర్పించడమే కాకుండా బస్సుల్లో ఎంత మందిని తరలిస్తున్నారూ.. ఎంతమేరకు పిల్లలకు రక్షణలో ఉన్నారో ముందుగానే తల్లిదండ్రులు గమనించాలి.

– పుప్పాల శ్రీనివాస్, డీటీసీ, హనుమకొండ

విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాం..



ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు సకాలంలో బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఫిట్‌నెస్ బస్సులే రోడ్డు ఎక్కాలి. ఈనెల 12 నుంచి విస్తృతంగా తనిఖీలు చేపడుతాం. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. యాజమాన్యాలు నిర్లక్ష్యాన్ని వీడి సకాలంలో ఫిట్‌నెస్‌లు చేయించుకోవాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించుకోవాలి. పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

– జైపాల్‌రెడ్డి, ఎంవీఐ, వరంగల్

విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి..



విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాం. రవాణా శాఖ నిబంధనాల మేరకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేస్తున్నాం. ఐదేళ్ల అనుభవం ఉన్న డ్రైవర్లను నియమించాం. రోడ్డు ప్రమాదాలకు తావు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాం.అత్యంత జాగ్రత్తగా పిల్లలను తీసుకువెళ్లేందుకు డ్రైవర్లకు నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం.

– గాదె స్వరూప్‌రెడ్డి, విద్యా సంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

కళాకారులను ప్రోత్సహించాలి


- వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య
- ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య

హన్మకొండ కల్చరల్ : రంగస్థల కళాకారులకు ఆదరణ కరువైందని, కళాపోషకులు కళాకారులను ప్రోత్సహించాలని వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య అన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే 15వ ఉభయ రాష్ట్రస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వరంగల్ పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో సాయంత్రం 7 గంటలకు బలగం సినిమా ఫేం, ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు జీవీ బాబు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ బందారు ఉమామహేశ్వరరావు, నేరేళ్ల శోభావతి, నటులు, ప్రయోక్త వనం లక్ష్మీకాంతారావు, కాజీపేట తిరుమలయ్య పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా తిరుమలయ్యను అభినందిస్తూ సన్మానించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన వెలగలేరు థియేటర్ వారు ప్రదర్శించిన 'రాత' నాటిక ప్రదర్శన, గుంటూరుకు చెందిన ఉషోదయ కళానికేతన్ వారు ప్రదర్శించిన 'ప్రక్షాళన' నాటిక అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ రాజకీయవేత్త ఈగ మల్లేశం, ప్రధానకార్యదర్శి ఎస్ఎస్ఆర్.మూర్తి, కార్యవర్గ సభ్యులు మాలి విజయరాజ్, కళారాజేశ్వరరావు, వేముల ప్రభాకర్, జెఎస్ శర్మ, లక్ష్మణ్, సాదుల సురేష్, కుసుమ సుధాకర్, జూలూరు నాగరాజు పాల్గొన్నారు.

సభ్యుల సమస్యలు పరిష్కరించాలి


- బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌గౌడ్


సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులతో దామోదర్‌గౌడ్

ఖిలా వరంగల్: బార్ అండ్ రెస్టారెంట్ సభ్యులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ కోరారు. ఆదివారం వరంగల్ రైల్వే గేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యుల సంక్షేమానికి అసోసియేషన్ పాటుపడాలని, సమస్యలు ఉంటే మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు రాష్ట్ర కమిటీలో సభ్యత్వాలు స్వీకరించారు. సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, కోశాధికారి మండ వెంకన్న, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.విజయ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గందె శ్రీనివాస్ గుప్తా, రాజుగౌడ్, వీరగోని నిరంజన్ గౌడ్, అడెపు రవీందర్, సూరజ్‌గౌడ్, ఎంబాడి రవీందర్, సభ్యులు, బార్,రెస్టారెంట్ యాజమాన్యం పాల్గొన్నారు.

యూనియన్‌ను బలోపేతం చేయాలి

- టీఆర్ పవర్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్


ఎన్నికైన నూతన కమిటీ

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జేఎస్ భూపాలపల్లి జిల్లా కేటీపీపీ చెల్పూర్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జెన్ కోలో విద్యుత్ ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ కేటీపీపీ చెల్పూర్ రీజియన్(జెన్ కో) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండా శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అరుణ్, ఉపాధ్యక్షులుగా జితేందర్, సతీష్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా రామారావు, కోశాధికారిగా విజేందర్, అదనపు కార్యదర్శిగా అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీధర్‌ను ఎన్నుకున్నట్టు శశికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ యూనియన్‌లకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరినట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట జి.వేణుగోపాల్, ఎస్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు రావు రమణారెడ్డి, నాయకులు వేణు, జితేందర్, అనిల్, సునీల్, రాము, సతీష్, శ్రీధర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పెళ్ళి.. ఎందుకోసం?

గృహప్రవేశం చేయాలి. అప్పుడు యజుర్వేదం అంతా మనకు వచ్చా, రాదా అన్న దానితో సంబంధం లేదు. గృహప్రవేశ సందర్భంలో రాముడేం చేసాడో ఆ ఘట్టం చదువుకుంటే చాలు... ఓహ్, గృహప్రవేశం ఇలా చేయాలన్న మాట.. అన్నది తెలుస్తుంది. తండ్రిగారికి తద్దినం పెట్టాల్సి వస్తే రాముడేం చేశాడో చదువుకుంటే సరిపోతుంది. అది పెట్టవలసి వచ్చినప్పుడు ఇలా పెట్టాలని అర్థమవుతుంది. అందుకే వేదం రామాయణంగా ప్రవర్తించింది.

చంద్రవంశాన్ని అంతటినీ వ్యాసుడు రచించాడు. సూర్యవంశాన్ని అంతటినీ కూడా వాల్మీకి వర్ణించాడు. సూర్యుడు, చంద్రుడు పగలూ రాత్రి ప్రకాశిస్తారు. ఒక పగలు, ఒక రాత్రి కలిస్తే ఒక రోజు పూర్తవుతుంది. వాఙ్మయంలో రామాయణం, భారతం ఇతర పురాణాలను వాల్మీకి, వ్యాసుడు అందించారు. స్వార్థంతోనో, ప్రత్యుపకారం ఆశించో కాక దీనివల్ల ధర్మానుష్ఠాన పద్ధతులను అందరికీ అర్థమయ్యే పద్ధతిలో విడమరిచి చెప్పకపోతే జనసామాన్యానికి ఎలా తెలుస్తుందనే సదుద్దేశంతో వారు మనకు ఈ మహోపకారం చేసారు.

వివాహం ఎంత గొప్పది! వివాహం అంటేనే విశిష్టమైనది–అని. దానిని మనకు సంప్రాప్తింప చేయడానికి జరిపే సంస్కారమే వివాహం. అది ఏదో సరదాకోసం కాదురా నాయనా, వివాహం చేసుకుంటా నంటున్నావు కదా, ముందు దానిగురించి, దానిలోని ధర్మ సూక్ష్మాలను గురించి తెలుసుకో. వివాహం అంటే విశిష్టమైనదానిని పొందుట. మరి ఆ విశిష్టమైనదేది? అదే మోక్షం. దీనిని పొందడానికి యోగ్యమైనది ధర్మానుష్ఠానం. అది సక్రమంగా జరగకుండా దానికి అడ్డుపడుతున్నవి ఏవి? అర్థకామాలు రాగద్వేషాలయి పాపపుణ్యాలకు, పునర్జన్మలకు కారణమవుతాయి. అలాకాకుండా దానిని ధర్మబద్ధం చేసి పాశాలు విడిపోవడానికి సంసార ప్రవేశం జరగాలి. అటువంటి గృహస్థాశ్రమంలోకి నీవు ప్రవేశిస్తున్నావు. అలా ప్రవేశించి రాముడేం చేసాడో తెలుసా? సీతారామకళ్యాణ ఘట్టం చూడు. అక్కడ సీతమ్మ ఏం చేసింది ? అసలు పెద్దవాళ్ళనే వాళ్ళు పెళ్ళికూతురిని, పెళ్లికొడుకుని కూర్చోబెట్టి ఏం మాట్లాడారో పరిశీలించు. పెద్దరికం అంటే ఏమిటో కూడా తెలుస్తుంది. ఇవన్నీ తెలిస్తే సంసారంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి, కుటుంబ జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ ఉద్దేశంతో రుషులు దేశకాలాలతో సంబంధం లేకుండా సర్వకాలాల్లో సర్వజనులకు ఉపయోగపడే విధంగా వాటిని అందించారు. అటువంటి రుషుల రుణం మనకు జన్మతః ఉంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మీరు ఎంతో చదువుకున్నారు... సరే. మంచిదే. నేను చదువును తక్కువ చేసి చెప్పడం లేదు. కానీ చదువుతో పాటుగా నిత్యజీవితంలో మనిషి మనిషిగా ఉండడానికి కావలసిన మానవత్వాన్ని నిలబెట్టడం చాలా అవసరం. అలా అది నిలబడాలంటే... రామాయణం, భారతం తదితర గ్రంథాలను బాగా పరిశీలించాలి. అవి నిత్యపారాయణకు యోగ్యత ఉన్న గ్రంథాలు. వాటిని కనీసం రోజుకో అధ్యాయం చొప్పున అయినా చదువుకుంటూ ఉండాలి. ఇంటిపట్టున పెద్దవాళ్ళు పిల్లలతో వాటిగురించి తరచూ మాట్లాడుతూ ఉండాలి. దానివల్ల ధార్మిక జీవనం అలవడడమే గాక, మనుషుల్లో మానవత్వం మిగులుతుంది. అది లేనప్పుడు మీరు సమకూర్చుకున్న జ్ఞానం, ప్రతిభాపాటవాలు సమాజానికి ప్రమాదకరంగా మారవచ్చు.

మంచిమాట

పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం?



''పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం'' అనే జాతీయం ఉంది. అతి తక్కువ బలం ఉన్న ప్రాణి మీద అనవసరంగా అతి పెద్ద బలప్రయోగం చేయటం అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఎంత చిన్న ప్రాణి అయినా దాని అస్తిత్వం నిరుపయోగం కాదు. విశ్వంలో, ముఖ్యంగా భూగోళంలో, ప్రధానంగా అది ఉండే ప్రాంతంలో అది పోషించవలసిన పాత్ర ఒకటి ఉండనే ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, తద్వారా పర్యావరణ సమతౌల్యత ఉంటాయి. దానికి భంగం కలిగిస్తే పర్యవసానం అనుభవించ వలసి ఉంటుంది.

ఒక పిచ్చుక సంవత్సరంలో 6.5 కిలోల బియ్యం తింటుంది అని చైనాలో ఒకప్పుడు చేపట్టిన సర్వే తెలిపింది. మొత్తం పిచ్చుకలు లేకుండా చేయగలిగితే 60 వేల మందికి ఆహారం లభిస్తుంది అని కూడా తెలిపింది. ఇంకేముంది? అసలే అధిక జనాభా సమస్య ఉన్న చైనా, వీలైనంత మందికి ఆహారం అందించటానికి ఇదొక మార్గం అనుకుని పిచ్చుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. 30 లక్షల పిచ్చుకలని చంపారు.

1958 – 61 సంవత్సరాల మధ్య చైనాలో తీవ్రమైన కరవు వచ్చింది. సుమారుగా నాలుగు కోట్ల యాభై వేల మంది చని పోయారు. కారణం ఏమై ఉంటుంది అని విచారణ చేస్తే పిచ్చుకలు లేక పోవటం వల్ల అని తేలింది. అదెట్లా? పిచ్చుకలు ధాన్యం తినటంతోపాటు పంటలని నాశనం చేసే పురుగులని కూడా తింటాయి. చీడ పురుగులని తినే పిచ్చుకలు లేక పోవటంతో పంటలకి చీడ పట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. అది రాను రాను పెరిగింది. ప్రజలు తిండి లేక చనిపోయారు.

దీనికి పరిష్కారం పంటలని నాశనం చేసే తెగుళ్ల కలిగించే పురుగులని రసాయన పదార్థాలు వాడ నవసరం లేకుండా తినేసే పిచ్చుకలు ఉండేట్టు చేయటమే అని నిర్ధారించారు. చేసేది ఏమీ లేక పిచ్చుకలని దిగుమతి చేసుకోవాలనుకున్నారు. రష్యా నుండి పిచ్చుకలని దిగుమతి చేసుకున్నారు. పరిస్థితి అదుపు లోకి వచ్చింది.


ఇటువంటి శాస్త్రీయమైన విషయాలని మన దేశంలో ఒక ఆనవాయితీగా, ఆచారంగా చేయటం అలవాటు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగువారు వరికంకులని కుచ్చుగా అల్లి ఇంటి ముందు వేలాడ దీసే వారు. పిచ్చుకలు వచ్చి ఒక్కొక్క వడ్లగింజని తీసుకు వెళ్లేవి. అది రైతు పురుగులని తిని చీడపీడల నుండి పంటని రక్షించిన పిచ్చుక పట్ల చూపించే కతజ్ఞత. ఇంటి ముందు కొన్ని గింజలు చల్లటం అలవాటు. ఆ అవకాశం ఉన్నా, లేక పోయినా ప్రతి రోజు పక్షులకి, ప్రత్యేకంగా కాకికి తినబోయే ముందు ఒక ముద్ద పెట్టటం అలవాటు. కాకి పరిసరాల్లో ఉన్న చెత్తని, చిన్న చిన్న పురుగులని తిని శుభ్రం చేస్తుంది. దేవాలయాలలో కూడా బలిహరణం అన్న పేరుతో నాలుగు దిక్కుల అన్నం ఉంచటం సంప్రదాయం. ఇంటి చూరులో పిచ్చుక గూడు పెడితే పరమానందం. ఆ గూట్లో పెట్టిన గుడ్లను పిల్లి తినకుండా కాపలా కాయటం ఒక సరదా. అవి ఉండే ప్రదేశాలని మనం ఆక్రమించి, చెట్లని నరికి వాటికి ఆహారం లేకుండా చేసినందుకు ఈ మాత్రం చేయక పోతే కృతఘ్నులం అవుతాం. అలాగని పిల్లులని పూర్తిగా తరమం. పిల్లి తిరుగుతుంటే ఆ వాసనకి ఎలుకలు విజృంభించవు.

సృష్టిలో ప్రయోజనం లేని జీవి ఒక్కటి కూడా లేదు. గుర్తించక పోవటం మన లోపం. జాగ్రత్తగా గమనిస్తే ఇతర జీవులని, ప్రకృతిని స్వార్థానికి వాడుకుని ఎవరికీ ఉపయోగ పడని ప్రాణి మానవుడొక్కడేనేమో అనిపిస్తుంది. కనీసం పిచ్చుక పాటి అయినా చేయవద్దా?

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికథ

దృష్టిని బట్టి సృష్టి



ఉత్తర భారత దేశానికి చెందిన ఒక ప్రొఫెసర్ స్వామి వారి దర్శనార్థం తిరుపతి వెళ్ళాడు. తనతో పాటు సహాయకుడిగా పరిశోధక విద్యార్థిని కూడా వెంట తీసుకు వచ్చాడు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి గుండా తిరుమలకు కాలినడకన వెళ్ళాలనేది ప్రొఫెసర్ గారి ఆలోచన. అలిపిరికి వెళ్ళి ఎత్తైన శేషాచల శిఖరాన్ని చూశారు. సముద్ర మట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉన్న ఏడుకొండల్ని చూసి భక్తి భావంతో దణ్ణం పెట్టుకున్నారు. పాదాల మండపం వద్ద శ్రీవారి లోహ పాదాలను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తూ ఉండగా పరిశోధక విద్యార్థి చిన్నగా ప్రొఫెసర్‌ని ఇలా అడిగాడు. ''దేవుడు నిజంగా ఉన్నాడంటారా?'' అని. ప్రొఫెసర్ నవ్వి ''దారిలో కనిపిస్తాడు పద!'' అని చెప్పి కాలి నడకకు పురమాయించాడు.

అలిపిరినుంచి ఆనంద నిలయుని సన్నిధికి దారి తీసే ఆ పడికట్ల దోవలో ప్రకృతి అందాలను వీక్షిస్తూ నడక ప్రారంభించారు. తలయేరు గుండు, గాలి గోపురం, ఏడవ మైలు ప్రసన్నాంజనేయ స్వామి, అక్కగార్ల గుడి, అవ్వాచారి కోన... దాటి మోకాలి మెట్టు చేరారు.

తిరుమల కొండ 'ఆదిశేషుని అంశ' అని భక్త జన విశ్వాసం. అందుకే చెప్పులు లేకుండా కొండ ఎక్కుతారు భక్తులు. ఈ కొండను పాదాలతో నడిచి అపవిత్రం చేయకూడదని శ్రీరామానుజులు, హథీరాంజీ బావాజీ మోకాళ్ళ మీద నడిచారని చెబుతారు. అప్పటినుంచి అది మోకాలి మెట్టు అయ్యిందని కూడా తెలుసుకున్నారు.

అక్కడ మెట్లు నిలువుగా మోకాలి ఎత్తు ఉండటం వల్ల మోకాళ్ళు పట్టుకుపోసాగాయి పరిశోధక విద్యార్థికి.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువైన ఆ విద్యార్థి గట్టిగా ''దేవుడు కనిపిస్తున్నాడు!'' అని చెప్పాడు.

చిన్న నవ్వు నవ్విన ప్రొఫెసర్, ''అనుకున్నది అనుకున్నట్లు ఎవరికీ జరగదు. అలా జరిగితే ఎవ్వరూ చెప్పిన మాట వినరు. తలచినట్లే అన్నీ జరిగితే... మనిషి దేవుడి ఉనికినే ప్రశ్నిస్తాడు. కష్టాలు, కన్నీళ్లు లేకుంటే తనంత గొప్పవాడు లేడని విర్రవీగుతాడు. అహాన్ని తలకి ఎక్కించుకున్నవాడు తనే దేవుడని చెప్పి ఊరేగుతాడు. జీవితం కష్టసుఖాల మయం కాబట్టే, మనిషి ఆ అతీత శక్తిని ఆరాధిస్తున్నాడు! అందుకే అలిపిరి వద్ద నేల మీద నడిచేటప్పుడు నీకు దేవుడి ఉనికి ప్రశ్నార్థకమయ్యింది. మోకాలిమెట్టు దగ్గరికి వచ్చేసరికి దేవుడు ఉన్నాడని అనిపించింది'' అని చెప్పి గబగబా మెట్లు ఎక్కసాగాడు.

'దృష్టిని బట్టి సృష్టి' అని తెలుసుకున్న విద్యార్థి గోవింద నామస్మరణ చేస్తూ ప్రొఫెసర్ వెనుకనే నడవసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా


ఎన్టీఆర్

గోవాలో ఆటా పాటా...


మళ్లీ గోవా వెళ్లాడు దేవర. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు గతంలో మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రంలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో ప్రారంభమైంది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్, కొంత టాకీ పార్ట్, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఈ ఏడాది మార్చిలో 'దేవర' యూనిట్ గోవాలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించింది. ఇప్పుడు మళ్లీ గోవాలో షూటింగ్ జరుగుతోంది.


అమితాబ్

సీక్వెల్ సెట్‌లో...

గుజరాతీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు అమితాబ్ బచ్చన్. 2022లో అమితాబ్ ఓ కీలక పాత్రలో నటించిన 'ఫక్త్ మహిళా మాటే' చిత్రానికి సీక్వెల్ ఇది. యశ్ సోనీ, దీక్షా జోషి ప్రధాన పాత్రల్లో నటించిన 'ఫక్త్ మహిళా మాటే'కు మంచి ప్రేక్షకాదరణ దక్కింది. జై బోదాస్ దర్శకత్వంలో ఆనంద్ పండిట్, వైశాల్ షా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఫక్త్ పురుషో మాటే' అనే సినిమాను ఆరంభించారు. అమితాబ్, యశ్ సోనీ, మిత్ర గాఢ్వీ, ఇషా కన్సారా, దర్శన్ జరీవాలా సీక్వెల్‌లో ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఈ సీక్వెల్‌ని పార్థ్ త్రివేదీతో కలిసి జై బోదాస్ దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం అమితాబ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ''అమితాబ్ బచ్చన్‌గారితో ఓసారి పని చేసిన ఎవరైనా ఆయనతో మళ్లీ వర్క్ చేయాలనుకుంటారు. అమితాబ్‌గారి ఎనర్జీ, అంకితభావం సెట్స్‌లో ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది'' అని పేర్కొన్నారు నిర్మాత ఆనంద్ పండిట్. ఈ సంగతి ఇలా ఉంచితే... మహిళల మనసుల్లో ఏముందో తెలుసుకోగల శక్తులు ఓ కుర్రాడికి వస్తాయి. వాటితో ఆ యువకుడు ఏం చేశాడు? విడిపోతున్న ప్రేమికులను ఎలా కలిపాడు? అనే అంశాలతో 'ఫక్త్ మహిళా మాటే' చిత్రం సాగుతుంది. ఇక సీక్వెల్ మగవారి కోణంలో ఉంటుందని టైటిల్ స్పష్టం చేస్తోంది.

ఆమెతో నమ్మకం మొదలవుతుంది


దీపికా పదుకోన్


ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. కాగా ఈ మూవీ ట్రైలర్‌ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, దీపికా పదుకోన్ లుక్‌ను విడుదల చేసింది. 'ది హోప్ బిగిన్స్ విత్ హర్' (ఆమెతో నమ్మకం మొదలవుతుంది) అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన దీపిక లుక్ నెట్టింట వైరల్‌గా మారింది. ''సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా 'కల్కి 2898 ఏడీ' రూపొందింది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరువేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్.

విలన్ వచ్చేశాడు

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ప్యాక్డ్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలోని విలన్ పాత్రకు బాలీవుడ్ నటుడు విద్యుత్ జమాల్‌ను తీసుకున్నారు మేకర్స్. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించి, సెట్స్‌లో విద్యుత్ జమాల్ పాల్గొన్న వీడియోను కూడా షేర్ చేశారు. ''నా స్నేహితుడు విద్యుత్ జమాల్‌తో కలిసి మళ్లీ వర్క్ చేయడం సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు మురుగదాస్. విజయ్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ 'తుపాకీ'లో విద్యుత్ జమాల్ విలన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.


విద్యుత్ జమాల్

ఈ నెలలోనే లాక్‌డౌన్!


అనుపమా పరమేశ్వరన్

ఈ నెలలోనే లాక్‌డౌన్ అంటున్నారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. కానీ కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే... ఆమె చెబుతున్నది 'లాక్‌డౌన్' సినిమా గురించి. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లాక్‌డౌన్'. ఏఆర్ జీవాను దర్శకుడిగా పరిచయం చేస్తూ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలో అనిత అనే పాత్రలో అనుపమా పరమేశ్వరన్ నటించినట్లుగా తెలుస్తోంది. లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి కష్టాలు పడుతున్న ఓ యువతి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. లాక్‌డౌన్ కష్టాలతోపాటు కరోనా వైరస్ గురించిన అంశాలను ఈ సినిమాలో కాస్త సీరియస్‌గానే చూపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఎన్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కెమెరా: వీజే సాబు జోసెఫ్.

టీజర్ రొమాంటిక్‌గా ఉంది
– అక్కినేని అమల


బాల రాజశేఖరుని, అమల

చైతన్యా రావ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాను బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అక్కినేని అమల మాట్లాడుతూ– ''తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలన్న బాల రాజశేఖరుని ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది. మా అన్నపూర్ణ కాలేజ్ విద్యార్థులు, సిబ్బందిని కూడా ఈ మూవీలోకి తీసుకున్నందుకు హ్యాపీగా ఉంది. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. నేటి సమాజంలోని వివాహ బంధాల గురించి ఒక బలమైన కథను ప్రేక్షకులకు చూపించబోతున్నట్లుగా టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''రొమాంటిక్ కామెడీగా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సుచిన్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వారు మా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు'' అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని, అరవింద్ కృష్ణ, అలీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కల్యాణీ మాలిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆర్పీ పట్నాయక్, కెమెరా: శిష్టా వీఎమ్‌కే.

భూగోళానికే నా చెలి అందం


శ్రీకమల్, తాన్వీ

''ప్రపంచానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం... ఇంతందాన్ని ఎవరైనా చూశారా..'' అంటూ సాగే పాట 'ఉషా పరిణయం' సినిమాలోనిది. 'నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి చిత్రాలను తెరకెక్కించిన కె. విజయభాస్కర్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉషా పరిణయం'. ఈ మూవీలో ఆయన తనయుడు శ్రీకమల్ హీరోగా నటించారు. తెలుగు అమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆకాశానికే జాబిలి అందం...' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్ పాడిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. ''ప్రేమకు నేనిచ్చే నిర్వచనం ఈ సినిమా. అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి'' అన్నారు కె. విజయభాస్కర్.

మూడు షెడ్యూల్స్‌లో...


అవినాష్, సిమ్రాన్

అవినాష్ తిరువీధుల, సిమ్రాన్ చౌదరి జంటగా కొత్త సినిమా షురూ అయింది. కార్తీ దర్శకత్వంలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ ఎల్ఎల్‌పీపై శాంతనూపతి, ఆలపాటి రాజా, అవినాష్ బుయాని, అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి క్లాప్ కొట్టగా, దర్శకుడు బాబీ దర్శకత్వం వహించారు. దర్శకుడు కార్తీ మాట్లాడుతూ– ''కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. నేడు రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, మూడు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం'' అన్నారు. ''మంచి సినిమా తీయాలనే సంకల్పంతో అమెరికా నుంచి వచ్చాం'' అన్నారు శాంతనూపతి. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు అంబికా కృష్ణ, దామోదర ప్రసాద్, టి. రామసత్యనారాయణ, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌నాయుడు, రచయిత విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ. విశ్వనాథ్, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: రాంబాబు కుంపట్ల.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
10-6-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,619	76,693
నిఫ్టీ ▲	469	23,290

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	17,133	▽	40
డోజోన్స్	38,799	▽	87
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,245	▽	40
డాక్స్	18,557	▽	95
షాంఘై	3,051	▲	2
నికాయ్	38,684	▽	20

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.54	85.22
£	బ్రిటన్ పౌండ్		104.33	109.19
€	యూరో		88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)		41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		53.23	58.01
S$	సింగపూర్ డాలర్		59.69	64.36
SAR	సౌదీ రియాల్		21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్		21.81	23.60
¥	చైనా యువాన్		10.39	12.46

బంగారం బంగారమే



కాలంతో పాటే దేశీ కరెన్సీ విలువ తరిగిపోతుంటుంది. కానీ, కాలంతోపాటే విలువ పెంచుకుంటూ వెళ్లే వాటిల్లో బంగారం కూడా ఒకటి. అందుకే ప్రతి ఒక్కరి పెట్టుబడుల్లో బంగారానికి (గోల్డ్) తప్పక చోటు ఇవ్వాలి. ఇటీవలి కాలంలో బంగారంలో మంచి ర్యాలీ చూస్తున్నాం. ప్రతి ఏటా పసిడి ఇదే మాదిరి పరుగు పెట్టుకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే విషయంలో నిజంగా 'బంగారమే' అని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. 2017–18 సంవత్సరం సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో ఇన్వెస్ట్ చేసినవారికి గడిచిన ఐదేళ్లలో ఏటా 16.5 శాతం రాబడి వచ్చింది. సంప్రదాయ డెట్ సాధనాల కంటే రెట్టింపు రాబడి బంగారంలో రావడం అంటే మామూలు విషయం కాదు. ఈక్విటీల స్థాయిలో బంగారం రాబడి ఇవ్వడం విశేషం. అందుకే దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు బంగారానికి తప్పక చోటు ఇవ్వాలి. ఏ రూపంలో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ ప్రయోజనమో తెలియజేసే కథనమే ఇది.



వివిధ సాధనాలు

బంగారంలో ఇన్వెస్ట్ చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఆభరణాలను పెట్టుబడిగా చూడొద్దు. ధరించడానికి కావాల్సినంత వరకే ఆభరణాలకు పరిమితం కావాలి. పెట్టుబడి కోసం అయితే ఎలక్ట్రానిక్ రూపంలో ఎన్నో సాధనాలు ఉన్నాయి. వీటిల్లో తమకు నచ్చిన దానిని ఎంపిక చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్స్, సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు), డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్న పలు రకాల సాధనాలు. వీటన్నింటిలోకి ఎస్‌జీబీలు ఎక్కువ ప్రయోజనకరం.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

స్టాక్స్ మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నిత్యం ట్రేడ్ అవుతుంటాయి. ఇందులో చార్జీలు, వ్యయాలు చాలా తక్కువ. భౌతిక బంగారం ధరలకు అనుగుణంగానే గోల్డ్ ఈటీఎఫ్ ధర ఏరోజుకారోజు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మారుతుంటుంది. నచ్చినప్పుడు కొనుగోలు చేసుకుని, అవసరమైనప్పుడు సులభంగా విక్రయించుకోవచ్చు. వీటిల్లో ఎక్స్‌పెన్స్ రేషియో రూపంలో ఏటా నిర్ణీత మొత్తాన్ని చార్జీగా తీసుకుంటారు. వీటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. ఉదాహరణకు ఎల్ఐసీ గోల్డ్ ఈటీఎఫ్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో 0.41 శాతంగా ఉంది. ఈ ఫండ్‌లో రూ.లక్ష ఇన్వెస్ట్ చేశారనుకోండి. దీనిపై 0.41 శాతం ప్రకారం రూ.410ని ఎక్స్‌పెన్స్ రేషియో కింద ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ వసూలు చేస్తుంది. ఇది కూడా సంవత్సరానికి ఒకే విడతగా కాకుండా, ఏ రోజుకారోజు ఇన్వెస్టర్ యూనిట్ల నుంచి తీసుకుంటుంది. పెట్టుబడులను ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ ఉండదు. పెట్టుబడులపై వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి చూపించి, తాము ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ మేరకు పన్ను చెల్లించాలి.

గోల్డ్ ఫండ్స్

ఇన్వెస్టర్ల పెట్టుబడులను తీసుకెళ్లి గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడమే గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ చేసే పని. కనుక వీటికి బదులు నేరుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనే పెట్టుబడులు పెట్టుకోవచ్చు. కానీ, కొందరికి గోల్డ్ మ్యూచువల్ ఫండ్సే అనుకూలం. ఎలా అంటే.. గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ ఒక గ్రాము బంగారం పరిమాణంలో



ట్రేడవుతుంటుంది. కనుక ఎంతలేదన్నా ఒక గ్రాము బంగారం స్థాయిలో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవాల్సి వస్తుంది. అదే గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌లో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడికి డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. కొనుగోలు చేసిన యూనిట్లు డీమ్యాట్ ఖాతాకే జమ అవుతాయి. కానీ గోల్డ్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతా తప్పనిసరి కాదు. కాకపోతే గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునే వారికి కొంచెం అదనపు భారం పడుతుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల అక్కడ ఎక్స్‌పెన్స్ రేషియో.. తిరిగి గోల్డ్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో పేరిట రెండు సార్లు చార్జీ చెల్లించాల్సి వస్తుంది. వీటిల్లో పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని రిటర్నుల్లో చూపించి, తమ శ్లాబు రేటు ప్రకారం చెల్లించాలి.

డిజిటల్ గోల్డ్

ఫోన్‌పే, పేటీఎం, పలు ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ గోల్డ్ కొనుగోలుకు వీలు కల్పిస్తున్నాయి. రూపాయి నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించుకోవచ్చు.



ఇన్వెస్టర్ కొనుగోలు చేసిన పరిమాణం మేర అసలైన బంగారం ఖజానాల్లో భద్రపరుస్తారు. కొంత మొత్తం సమకూరిన తర్వాత (కనీసం 10 గ్రాములు అంతకుమించి) భౌతిక రూపంలో తీసుకోవచ్చు. లేదా ఎంపిక చేసిన జ్యుయలరీ సంస్థల్లో ఆభరణాల కిందకు మార్చుకోవచ్చు. అవసరం ఏర్పడితే దీనిపై రుణం పొందొచ్చు. ఇందులో కాస్త చార్జీలు ఎక్కువ. ఒక ఇన్వెస్టర్ ఒక ప్లాట్‌ఫామ్‌లో గరిష్ఠంగా రూ.2లక్షలు మించి కొనుగోలు చేయలేరు. ఆర్‌బీఐ, సెబీ తదితర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ వీటిపై ఉండదు. ఇందులో వచ్చే లాభాలు సైతం వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది.

బంగారం బాండ్లు

భౌతిక బంగారంపై పెట్టుబడుల ఒత్తిడిని తగ్గించేందుకు.. డిజిటల్ రూపంలో బంగారంపై పెట్టుబడులను, పారదర్శకతను ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సాధనమే సావరీన్ గోల్డ్ బాండ్స్ పథకం. ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ ఒకటికి మించిన పర్యాయాలు ఎస్‌జీబీలను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ విక్రయిస్తుంటుంది. ఒక గ్రాము డినామినేషన్ రూపంలో బాండ్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇష్యూ సమయంలో ఒక గ్రాము ధర ఎంతన్నది ఆర్‌బీఐ ప్రకటిస్తుంటుంది. బ్యాంక్‌లు, బ్రోకరేజీ సంస్థలు, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ కొనుగోలుకు అవకాశం కల్పిస్తుంటాయి. ఈ బాండ్ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఇందులో పెట్టుబడిపై ఏటా 2.5 శాతం చొప్పున ఎనిమిదేళ్ల పాటు వడ్డీని ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తుంది. ఎనిమిదేళ్ల తర్వాత బంగారం మార్కెట్ ధర ప్రకారం ఇన్వెస్టర్‌కు ఆర్‌బీఐ చెల్లింపులు చేస్తుంది. లాభంపై పన్ను లేకపోవడం, ఏటా 2.5 శాతం రాబడి వల్ల అన్నింటిలోకి ఇది మెరుగైన సాధనం అని చెప్పుకోవాలి. ఇక ఎస్‌జీబీపై ఏటా వచ్చే 2.5 శాతం వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. రిటర్నుల్లో 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్'లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడి కొనసాగించినట్టయితే.. వచ్చే మూలధన లాభంపై పన్ను ఉండదు. మధ్యలోనే వైదొలిగితే లాభం పన్ను పరిధిలోకి వస్తుంది. ''ఏడాదిలోపే విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి కలిపి రిటర్నుల్లో చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత విక్రయించేట్టు అయితే లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణాన్ని తీసేసే ఇండెక్సేషన్ ఎంపిక చేసుకుంటే కనుక 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది'' అని ఆర్‌ఎస్‌ఎం ఇండియా వ్యవస్థాపకుడు సురేష్ సురానా తెలిపారు. ఈ బాండ్‌కు ప్రభుత్వ హామీ ఉంటుంది.

రాబడులు

బంగారంపై పెట్టుబడి దీర్ఘకాలంలో డెట్ కంటే మెరుగైన రాబడే ఇచ్చినట్టు చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన 20 ఏళ్లలో ఏటా 11 శాతం కాంపౌండెడ్ రాబడిని బంగారం ఇచ్చింది.

సంవత్సరం వారీ 10 గ్రాముల బంగారం ధరలు (రూపాయిల్లో)

సంవత్సరం	ధర
2015	26,343
2016	28,623
2017	29,667
2018	31,438
2019	35,220
2020	48,651
2021	48,720
2022	52,670
2023	65,330
2024	71,913



ఎస్‌జీబీల్లో రాబడి

ఇండియా బులియన్‌అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం (గత మూడు పనిదినాల్లోని సగటు)ధరను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఐబీజేఏ ధర మార్కెట్ ఆధారితమే. మొదటి విడత జారీ చేసిన ఎస్‌జీబీ 2016– సిరీస్1 బాండ్ గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ముగిసింది. నాడు ఒక గ్రాము బాండ్ రూ.2,600కు విక్రయించారు. గడువు ముగిసిన రోజు ఆర్‌బీఐ నిర్ణయించిన ధర రూ.6,271. ఇందులో ఇన్వెస్ట్ చేసి చివరి వరకు కొనసాగిన వారికి ఏటా 11% రాబడి వచ్చింది. 2.5% వడ్డీ రాబడిని కలిపి చూస్తే వార్షికంగా 11.63 శాతం చొప్పున నికర రాబడి వచ్చినట్టు. ఇది బంగారం గత 20 ఏళ్ల సగటు రాబడి కంటే ఎక్కువే ఉండడం గమనార్హం. తర్వాత వచ్చిన సిరీస్‌లపై రాబడులు మరింత అధికంగా ఉంటున్నాయి.

సిరీస్-8, 9 రాబడులు

బాండ్	జారీ తేదీ	జారీ ధర (రూ.లో)	మెచ్యూరిటీ ధర (రూ.లో)	వడ్డీ రాబడి
ఎస్‌జీబీ 2017-18.సిరీస్-8	20 నవంబర్ 2017	2.961	7.217	16.50
ఎస్‌జీబీ 2017-18. సిరీస్-9	27 నవంబర్ 2017	2.964	7.217	16.44



2017 నవంబర్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 మధ్య నిఫ్టీ50 సూచీ ఇచ్చిన వార్షిక కాంపౌండెడ్ రాబడి 13.62% ఎస్‌జీబీ సిరీస్-8,9 కంటే తక్కువగా ఉండడం గమనించొచ్చు. (వడ్డీ శాతాల్లో)

ఇతర వివరాలు

ఎస్‌జీబీలపై వడ్డీని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. చివరి ఆరు నెలల వడ్డీ, మెచ్యూరిటీతో కలిపి ఇస్తారు. ఒక ఇన్వెస్టర్ కనిష్ఠంగా ఒక గ్రాము, గరిష్ఠంగా ఒక ఆర్థిక సంవత్సరంలో 4 కిలోల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఎస్‌జీబీలను ఎనిమిదేళ్ల పాటు గడువు పూర్తయ్యే వరకు కొనసాగించినప్పుడే లాభంపై ఎలాంటి పన్ను పడదు. ఒకవేళ ఈ మధ్యలోనే వైదొలిగితే లాభం వార్షిక ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి ప్రతి గ్రాముపై రూ.50 తగ్గింపు లభిస్తుంది.

కేటాయింపులు ఎంత మేర?

ఒకరి మొత్తం పెట్టుబడుల్లో కనీసం 5% బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిపుణుల సూచన. గరిష్ఠంగా 10 వరకు కేటాయించుకోవచ్చు. మోస్తరు రాబడులు వచ్చినా ఫర్వాలేదు, రిస్క్ వద్దనుకునే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో 15% వరకు కూడా బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కానీ, పెట్టుబడి కోసం భౌతిక బంగారం అంత మెరుగైన ఆప్షన్ కాబోదు. ఎందుకంటే అసలు బంగారం ధరకు తోడు, కొనుగోలు ధరపై 3% మేర జీఎస్‌టీని భరించాల్సి ఉంటుంది. అదే పెట్టుబడి కోసం అని చెప్పి ఆభరణాలు కొనుగోలు చేస్తే దానిపై తయారీ చార్జీలు, తరుగు భరించాల్సి వస్తుంది. ఇవన్నీ నికర రాబడులను ప్రభావితం చేస్తాయి. కనుక బంగారంపై పెట్టుబడి ఎప్పుడూ కూడా డిజిటల్‌గానే ఉంచుకోవడం మంచి ఆప్షన్ అవుతుంది. దీనివల్ల భద్రతాపరమైన రిస్క్ కూడా ఉండదు.

ముందస్తు ఉపసంహరణ ఎలా?

ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు అయినప్పటికీ.. కోరుకుంటే ఆ లోపు కూడా విక్రయించుకోవచ్చు. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఐదేళ్లు ముగిసిన తర్వాత ఆర్‌బీఐ ముందస్తు ఉపసంహరణకు వీలు కల్పిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ అవకాశం ఉంటుంది. బంగారం బాండ్‌పై ఆరు నెలలకు ఒకసారి ఆర్‌బీఐ వడ్డీ చెలిస్తుందని చెప్పుకున్నాం కదా. ఆ వడ్డీ చెల్లింపు తేదీ నుంచి 21 రోజుల ముందు వరకు ఇన్వెస్టర్ తన వద్దనున్న బాండ్‌ను ఆర్‌బీఐకి ఇచ్చేయాలి. దీనిపై ఎలాంటి చార్జీలు ఉండవు. ఇక ఇన్వెస్ట్ చేసిన తేదీ నుంచి ఐదేళ్లలోపే బాండ్‌ను విక్రయించుకోవాలంటే.. ఉన్న ఏకైక మార్గం స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ). కాకపోతే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో కొనుగోలుదారులు పరిమితంగా ఉంటుంటారు. లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. కొనుగోలుదారు అందుబాటులో ఉంటే విక్రయించుకోవచ్చు. కాకపోతే డిమాండ్ తక్కువ కనుక మార్కెట్ రేటు కంటే తక్కువకే ఇక్కడ విక్రయాలు నమోదవుతుంటాయి. బంగారం బాండ్ భౌతిక రూపంలో ఉంటే దాన్ని డీమెటీరియలైజ్ చేసుకున్న తర్వాతే విక్రయించుకోవడం సాధ్యపడుతుంది.



టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్
మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్



ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 15 వరకు అందుబాటులో ఉంటుంది. యూనిట్ ఎన్ఏవీ రూ.10గా ఉంటుంది. టాటా ఏఐఏ పాలసీదారులు కంపెనీకి చెందిన ఫార్చ్యూన్ ప్రో, వెల్త్ ప్రో, ఫార్చ్యూన్ మ్యాక్సిమా వంటి యులిప్ పథకాలు, వినూత్న పరమ్ రక్షక్ ప్లస్, ప్రో-ఫిట్ వంటి పథకాల ద్వారా ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మూమెంటమ్ 50 ఇండెక్స్‌లో అధిక వృద్ధి అవకాశాలున్న టాప్ 50 కంపెనీల పనితీరును ఇది ట్రాక్ చేస్తుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని, మెరుగైన రాబడులను కోరుకుంటున్న ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని సంస్థ తెలిపింది. గడిచిన 9 ఏళ్లలో మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ 11 రెట్లు పెరిగినట్లు వివరించింది. తయారీ.. సర్వీసులు వృద్ధి చెందుతుండటం, వినియోగ డిమాండ్ పెరుగుతుండటం, పొదుపు మొత్తాలు ఈక్విటీల వైపు మళ్లుతుండటం వంటి అంశాలు ఈ విభాగ సంస్థలకు సానుకూలమని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-6-2024

విశాఖ	475–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	475–00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00

రాబడుల్లో స్థిరత్వం.. డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

మార్కెట్లో అన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసుకోవాలనుకునే వారు తమ పోర్ట్‌ఫోలియోలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు చోటు కల్పించుకోవచ్చు. ఈ విభాగంలో డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో ఒకటిగా ఉంది.

రాబడులు

గడిచిన ఆరు నెలల కాలంలో ఈ పథకం 7.32 శాతం రాబడిని ఇచ్చింది. అదే ఏడాది కాలంలో రాబడి 27.50 శాతంగా ఉంది. మూడేళ్లలో 13.43 శాతం, ఐదేళ్లలో 16.58 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 14.30 శాతం చొప్పున ఏటా రాబడులు ఈ పథకంలో ఉన్నాయి. ఈ పథకం 1997 ఏప్రిల్ 29న ప్రారంభమైంది. నాటి నుంచి చూస్తే ఏటా 19 శాతం రాబడిని ఇచ్చింది. గతంలో ఈ పథకం మల్టీక్యాప్‌గా ఉండేది. మ్యూచువల్ ఫండ్స్ పథకాల పునర్‌వ్యవస్థీకరణ అనంతరం సెబీ ఆదేశాల మేరకు ఫ్లెక్సీక్యాప్ విభాగం కిందకు మారింది. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడి కనీసం 12 శాతంపైన ఉంటే దాన్ని మెరుగైనదిగా నిపుణులు పరిగణిస్తుంటారు.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఒక విభాగంలో వ్యాల్యుయేషన్స్ ఖరీదుగా మారిన సందర్భాల్లో పెట్టుబడులు తగ్గించుకుని, ఆకర్షణీయంగా ఉన్న ఇతర విభాగాల్లోకి అధిక పెట్టుబడులు మళ్లిస్తుంటుంది. నాణ్యమైన, సత్తా ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుని, ఎక్కువ కాలం పాటు కొనసాగడాన్ని అనుసరిస్తుంది. మార్కెట్ కరెక్షన్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటుంది. లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేయడం ద్వారా 2008, 2011, 2015, 2020 మార్కెట్ పతనాల్లో నష్టాలను పరిమితం చేసింది. అదే సమయంలో మార్కెట్ ర్యాలీల్లోనూ మెరుగైన ప్రదర్శనే చేసింది. 2020 మార్చి మార్కెట్ పతనం సమయంలో ఈక్విటీల్లో పెట్టుబడులు 93 శాతంగానే ఉన్నాయి. మార్కెట్ల విలువలు గరిష్ఠాలకు చేరాయన్న జాగ్రత్తతో నగదు నిల్వలను 7 శాతానికి పెంచుకుంది. అదే ఏడాది దిద్దుబాటు అనంతరం క్రమంగా ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంది.



పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ. 10,409 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.39 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.61 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. 63 శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.63 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 4.77 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఎక్స్‌పెన్స్ రేషియో 1.75 శాతంగా ఉంది. ఒక విధంగా ఈ పథకం ఇన్వెస్టర్ల నుంచి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నట్టు భావించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 56 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని పరిశీలిస్తే.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, 33 శాతం మేర పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్‌కు 11.95 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీకి 11.22 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 10 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 8.79 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)


కంపెనీ	పెట్టుబడులు
బజాజ్ ఫైనాన్స్	6.49
ఐసీఐసీఐ బ్యాంక్	5.96
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.25
మదర్సన్ సుమీ	4.08
యాక్సిస్ బ్యాంక్	3.47
అవెన్యూ సూపర్‌మార్ట్స్	3.21
పాలీక్యాబ్ ఇండియా	2.81
ఇన్ఫోసిస్	2.72
ఇండస్ టవర్స్	2.64
గుజరాత్ ఫ్లోరోకెమ్	2.37

స్టాక్స్ వ్యూ

జాగిల్ ప్రీపెయిడ్	ఈక్విరస్ సెక్యూరిటీస్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 281 **టార్గెట్:** రూ. 400

ఎందుకంటే: జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. సాస్(ఎస్ఏఏఎస్) ఆధారిత వినియోగ వ్యయ(స్పెండ్స్) మేనేజ్‌మెంట్, అనలిటిక్స్ లీడింగ్ ప్లాట్‌ఫామ్. కంపెనీ ప్రత్యేక బిజినెస్ మోడల్‌ను కలిగి ఉంది. ప్రధానంగా చానల్ భాగస్వాములు, ఉద్యోగులు, వెండార్ ప్లాట్‌ఫామ్స్ కోసం ఉద్యోగుల(ఎంప్లాయీ) రీఇంబర్స్‌మెంట్స్, పన్ను లబ్ధి(ట్యాక్స్ బెనిఫిట్స్), రివార్డులు, ప్రోత్సాహకాల(ఇన్సెంటివ్స్) సంబంధ సర్వీసులు అందిస్తోంది. ప్రొడక్ట్ ద్వారా లబ్ధి పొందుతున్న కార్పొరేట్ల నుంచి ఆదాయంలో ప్రత్యక్షంగా 10 నుంచి 20 శాతమే సమకూర్చుకుంటోంది. ఇది అటు కార్పొరేట్లకు ఇటు కంపెనీకి ప్రయోజకారిగా నిలుస్తోంది. కార్డుల వినియోగం జరిగే లేదా రివార్డ్ వోచర్లు రీడీమ్ అయ్యే మర్చంట్ల నుంచి మిగిలిన ఆదాయాన్ని పొందుతోంది. కార్యకలాపాలు విస్తరించిన మూడు ప్రొడక్టుల విభాగాలలోనూ సరైన పోటీదారులు లేకపోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా కంపెనీ సర్వీసులందిస్తున్న రంగం దేశీ మార్కెట్ పరిమాణం రూ. 13,900 కోట్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. కంపెనీ లైఫ్‌సైకిల్‌లో ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉన్నట్లు భావిస్తున్నాం. వెరసి కొత్త కస్టమర్లను పొందడం, ప్రస్తుత కస్టమర్లకూ ఇతర ప్రొడక్టులను విక్రయించగలగడం(క్రాస్ సెల్లింగ్), కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టడం, విదేశాలలోనూ కార్యకలాపాలు విస్తరించడం తదితరాల ద్వారా కంపెనీ భారీ వృద్ధికి పలు అవకాశాలున్నాయి. ఇటీవల జోయర్ పేరుతో విడుదల చేసిన వెండార్ పేమెంట్స్ సొల్యూషన్స్ దీనికి జత కలవనుంది.



ఆస్క్ ఆటోమోటివ్	జేఎమ్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుతధర: రూ. 314 **టార్గెట్:** రూ. 375

ఎందుకంటే: ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలో బ్రేక్ షూ, డ్రమ్ బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీలో దేశీయంగా ఆస్క్ ఆటోమోటివ్ నాయకత్వ స్థాయిలో ఉంది. రెండు విభాగాలు కలిపి 50 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టూవీలర్ బ్రేకింగ్‌లోకి ఆలస్యంగా ప్రవేశించినప్పటికీ ఈ రంగంలో వినియోగించే తేలికపరచే(లైట్ వెయిటింగ్) అల్యూమినియం విడిభాగాలు, సేఫ్టీ కంట్రోల్ కేబుళ్ల(ఎస్‌సీసీ) తయారీలో సుప్రసిద్ధ కంపెనీగా కార్యకలాపాలు విస్తరించింది. మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ఇందుకు సొంత సాంకేతికతల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్ సామర్థ్యాలు తోడ్పాటునిస్తున్నాయి. ప్రొప్రయిటరీ ఫార్ములేషన్స్ వినియోగించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన సొల్యూషన్లను అభివృద్ధి చేసి అందిస్తోంది. అంతేకాకుండా నాణ్యత, ధర, డెలివరీలపై దృష్టి పెట్టడం ద్వారా కస్టమర్లకు చేరువగా నిలుస్తోంది. వెరసి గత కొన్నేళ్లుగా ద్విచక్ర వాహన పరిశ్రమను మించిన వృద్ధిని సాధిస్తోంది. 2013–23 కాలంలో ద్విచక్ర వాహన పరిశ్రమ సగటున 10 శాతం వార్షిక వృద్ధిని అందుకుంది. అయితే విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, కొత్త కస్టమర్లను జత చేసుకోవడం, ప్రస్తుత కస్టమర్ల నుంచి వాలెట్ షేర్‌ను పెంచుకోవడం ద్వారా పరిశ్రమను మించి ప్రగతి పథంలో పరుగెడుతోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగంలో ఎలక్ట్రిక్ సాంకేతికతలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) మార్పు కారణంగా అల్యూమినియం లైట్‌వెయిటింగ్ పరికరాల విభాగంలో కిట్ విలువ బలపడుతోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151, T.G. and Printed at Jagati Publications Limited,Survey No. 602/A, Rampur Village, Dharmasagar Mandal, Warangal dist - 506151.
Editor: V.Murali,(Responsible for selection of News under the PRB Act) Phone No. 08711-223111, Fax No.08711- 223330, RNI Regn No. TEL TEL/2008/23806.